

వీసీపల్లి మండలంలో సాగుకు నోచుకోకుండా బీడును తలపిస్తున్న భూమి (ఇన్‌సెట్లో) దర్శి ప్రాంతంలో ఎదుగుదల లేని కందిపైరు

నిండు వర్షాకాలం. ఊరూవాడా చిత్తడిగా మారాల్సిన సమయం. పొలంలో వేసిన విత్తనాలు మొలకెత్తి పచ్చదనం పరుచుకోవాల్సిన తరుణం. కానీ జిల్లాలో అందుకు పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా వర్షాభావం వెంటాడుతోంది. ఆకాశంలో కమ్ముకుంటున్న కారుమబ్బులు రైతుల్లో ఆశలు రేకెత్తించి అంతలోనే మాయమవుతున్నాయి. అక్కడక్కడా జల్లులు తప్ప జడివాన కరువైంది. దీంతో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో నాల్గోవంతు కూడా సాగుకు నోచుకోలేదు. వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తుండటంతో వేసిన పైర్లు కూడా ఎండిపోతున్నాయి. కీలకమైన కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా చేయలేమని వారు వాపోతున్నారు.

24 శాతమే!

ఖరీఫ్‌లో పంటల సాగు పరిస్థితి ఇదీ

- వెంటాడుతున్న వర్షాభావం
- సాధారణంలో నాల్గోవంతు కూడా దాటని విస్తీర్ణం
- కీలకమైన కంది, పత్తి సాగుకు మించిపోతున్న సమయం
- ఎండల తీవ్రతతో వేసిన పైర్లు కూడా వాడుముఖం
- ఆందోళనలో రైతులు

ఒంగోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ ప్రతికూలంగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచినా సాధారణంలో 24శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఖరీఫ్ సీజన్‌గా పరిగణిస్తారు. ఆ సమయంలో సుమారు 2.02 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. కంది, పత్తి, మిర్చి ప్రధాన పంటలు. వాటితోపాటు వరి, సజ్జ, జొన్న మొక్కజొన్న, నువ్వు, పెసర, మినుము ఇతరత్రా పలు పైర్లు వేస్తారు. ఒక్క వరి పూర్తిగా సెప్టెంబర్‌లో, అదే నెలలో మిర్చి కొంత విస్తీర్ణం సాగు చేస్తారు. మిగతావన్నీ వర్షాధార పంటలే. సాధారణంగా ఈ సమయానికి ఆ పంటల సాగు మూడొంతులు పూర్తవుతుంది. ఆ రకంగా ఆగస్టు ఆఖరుకు లక్షన్నర హెక్టార్లలో పంటలు వేస్తారు. అయితే మరో ఐదు రోజుల్లో నెల ముగుస్తున్నా ఇంతవరకూ 50 వేల హెక్టార్లలో కూడా పంటలు సాగుకు నోచుకోలేదు.

48,464 హెక్టార్లలోనే సాగు

జిల్లాలోని ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో ఇప్పటి వరకూ కేవలం 48,464 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో కేవలం 24 శాతం లోపుగానే విత్తనం పడింది. సరైన వర్షాలు కురవక ఈ పరిస్థితి ఏర్పడింది. వాతావరణం అనుకూలించి సకాలంలో పంటలు సాగైతే ఈ సమయానికి జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో ఏగ్రామం వెళ్లినా పొలాలు పచ్చని పైర్లతో కళకళలాడుతుండేవి. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి కన్పించడం లేదు. ఎక్కువ భూములు సాగుకు నోచుకోలేదు. వేసిన పైర్లు కూడా వాడుముఖం పట్టాయి.

ఆరంభంలో మురిపించి.. ఆతర్వాత సరిపడా కురవని వాన

ఈ ఏడాది తొలుత కాస్తంత అనుకూలంగానే వాతావరణం కనిపించింది. జూన్‌లో సాధారణం కన్నా అధికంగానే వర్షం కురిసింది. దీంతో జిల్వావ్యాప్తంగా రైతులు సాగుకు సిద్ధమయ్యారు. అయితే జూలైలో నెలకొన్న వర్షాభావం పంటల సాగును దెబ్బతీసింది. దుక్కులు దున్ని విత్తేందుకు సిద్ధమైన రైతులు వర్షాలు లేక పంటలు సాగు చేయలేకపోయారు. తొలకరి పైర్లుగా పిలుచుకొనే సజ్జ, జొన్న, నువ్వు, పెసర పశుగ్రాసం సాగుకు జూలైలో నెలకొన్న వర్షాభావం విఘాతం కలిగించింది. ఖరీఫ్‌లో కీలకమైన కంది, పత్తి, మిర్చి ఇతరత్రా వాటి పైనా ఆ ప్రభావం పడింది.

ప్రధాన పంటల సాగు అరకొరే!

ఖరీఫ్‌లో అత్యధిక విస్తీర్ణంలో కంది, పత్తి సాగు చేస్తారు. ఈ సీజన్‌లో కంది సుమారు 73 వేలు, పత్తి 31 వేలు వెరసి ఈ రెండు పంటలే దాదాపు 1.04లక్షల హెక్టార్లలో సాగు చేస్తారు. ఇప్పటి వరకూ రెండు పంటలూ కలిపి కేవలం 26 వేల హెక్టార్లలోపు మాత్రమే సాగు కాగా మరో ప్రధానమైన మిర్చి సాగు కూడా కదలలేదు. ఈ నెలాఖరుతో కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండగా తదుపరి వర్షాలు కురిసినా వరి, మిర్చి, మినుము, ఇతర పంటలు సాగుకు పెద్దగా అవకాశం ఉండదు. ఈ ప్రకారం చూస్తే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



దోర్నాల ప్రాంతంలో ఎండిపోతున్న పత్తిపంట

జిల్లాలో పంటల సాగు వివరాలు

- ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం : 2,02,249 హెక్టార్లు
- పంటలు సాగు చేసిన విస్తీర్ణం : 48,464 హెక్టార్లు
- సాగు శాతం : 23.96

పంట	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు శాతం
కంది	73,003	17,441.15	24.0
పత్తి	31,562	8,387.59	27.0
మిర్చి	23,873	767.65	3.22
వరి	14,078	1,007.80	7.0
సజ్జ	7,125	4,046	57
నువ్వు	2,790	2,829.70	101
మొక్కజొన్న	2,464	1,985.42	81.0
మినుము	2,520	250.00	10.0

సాగుకు సాగర్ నీరు

- వచ్చేనెల మొదటి వారంలో విడుదల
- కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడి



ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24 : జిల్లాలో సాగుకు సాగర్ నీటిని వచ్చేనెల మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కేటాయింపుల ఆధారంగా నీటి పంపిణీ జరుగుతుందన్నారు. సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఆమె కోరారు. జిల్లాలో అధికారికంగా ఉన్న ఆయకట్టు 2,54,392 ఎకరాలకు ఒక పంటకు సాగునీటిని ఇస్తామన్నారు. అవసరమైతే వారబందీ విధానంలో నీటిని మేజర్లకు సరఫరా చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణలో నీటిని క్రమపద్ధతిన వినియోగించుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని అందుకోసం మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ కోరారు.

విద్యాశాఖలో పథకాలకు మహనీయుల పేర్లు

- గౌరవించిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు (విద్య), ఆగస్టు 24 : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో అమలవుతున్న వివిధ పథకాల పేర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం మార్చింది. గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్ పేరుతో అమలు చేసిన వాటికి మహనీయుల పేర్లు పెట్టింది. వారిని గౌరవించింది. ఈమేరకు ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్య మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశీల్రగత విభాగం డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం ఆరు పథకాల పేర్లను మార్చారు. జగనన్న అమ్మ ఒడికి తల్లికి వందనంగా నామకరణం చేశారు. జగనన్న విద్యాకానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా మార్చారు. జగనన్న గోరుముద్ద ఇకపై డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా అమలు చేయనున్నారు. మనబడి నాడు-నేడును మనబడి-మనభవిష్యత్‌గా మార్చారు. స్వేచ్ఛ పథకానికి బాలికా సురక్ష పేరు పెట్టారు. జగనన్న ఆణిముత్యాలను అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారంగా మార్చారు. ఈనెల 22 నుంచి ఈ పథకాలకు కొత్తపేర్లు అమల్లోకి వచ్చాయి

రేపు 'మీకోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24 : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (ప్రజా ఫిర్యాదుల దినం)ను సోమవారం రద్దు చేసినట్లు కార్యక్రమ జిల్లా సూపరింటెండెంట్ డి.నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా సెలవు దినం కావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అర్జీలతో ఎవ్వరూ ఒంగోలు రావద్దని ఆమె కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన మీకోసంను రద్దు చేసినట్లు ఎస్పీ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

స్కూలు బస్సులపై కొరడా

- రవాణా శాఖ అధికారుల తనిఖీలు
- తొమ్మిది కేసులు నమోదు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూలు బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. శనివారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద 60 బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని బస్సు డ్రైవర్లు, పన్నులు చెల్లించని బస్సు యాజమానులపై తొమ్మిది కేసులు నమోదు చేసినట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. నిబంధనల ప్రకారం 60 ఏళ్లు పైబడిన వారు బస్సు నడపకూడదు. అయితే ఓ బస్సు డ్రైవర్‌కు 60 ఏళ్లకుపైన ఉన్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. మరో రెండు బస్సులు క్వార్టర్ ట్యాక్స్ చెల్లించకపోగా, ఒక బస్సుకు అసలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదు. ఇరువురు డ్రైవర్లు లైసెన్సులు లేకుండా, నలుగురు యూనిఫాం ధరించకుండా బస్సు నడుపుతున్నారు. వీరందరిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు ఎంవీఐ తెలిపారు.



ఒంగోలులోని మైన్స్ కార్యాలయం

గనుల శాఖ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ఐదేళ్లలో ఇసుక అక్రమాలపై ఆరా
- రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24 : ఒంగోలులోని భూగర్భ, గనుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన ఇసుక అక్రమాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఇసుకు తవ్వకాలకు ఇచ్చిన అనుమతుల గురించి విచారించినట్లు తెలిసింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ ఇసుక టెండర్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో ఒంగోలులో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ సోదాలు కొనసాగాయి. పూర్తిగా కార్యాలయం గేట్లు మూసివేసి సిబ్బందిని మాత్రమే లోపలికి అనుమతించారు. రికార్డులను నిశితంగా పరిశీలించారు. జిల్లాలో ఇసుక తవ్వకాల లీజును వైసీపీ హయాంలో జేపీ పవర్ వెంచర్స్‌కు ఇచ్చారు. అయితే జేపీ పవర్ వెంచర్స్ అప్పట్లో అడ్డగోలుగా తవ్వకాలు, అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏసీబీ అధికారులు సమగ్రంగా విచారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి ఎంత చెల్లించారు? అసలు బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా ఎలా జరిగింది? అన్న విషయాలపై లోతుగా ఆరా తీసినట్లు సమాచారం. ఇసుక రీచ్‌లు లేకుండానే ఎక్కడైనా అనుమతులు ఇచ్చారా? అన్న అంశాన్ని కూడా పరిశీలించినట్లు సమాచారం. ఇసుక తవ్వకాలకు సంబంధించి జేపీ పవర్ వెంచర్స్ ప్రభుత్వానికి రూ.13 కోట్లు చెల్లించాలని గనుల శాఖ గతంలో నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. కానీ ఆమొత్తాన్ని ఇప్పటి వరకూ చెల్లించలేదని సమాచారం. అందుకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. తనిఖీలలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్షాధికారిని చేయడమే లక్ష్యం



ఒంగోలు నగరం, ఆగస్టు 24 : పొదుపు సంఘాల మహిళల్ని లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతీ దీదీ పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని ప్రధాని మోదీ ఆదివారం మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలను అందించనున్నారు. ఈ యూనిట్ల నిర్వహణ ద్వారా ఏడాదికి ఒక్కో లబ్ధిదారు వార్షికాదాయం లక్ష రూపాయలకు తగ్గకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఈ పథకం కింద యూనిట్లను స్థాపించే వారిని ప్రభుత్వం లక్‌పతీ దీదీలుగా పిలవనుంది. ఒక్కొక్కరికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రుణం ఇవ్వనుంది. వారు యూనిట్లను స్థాపించుకుని వాటిని విజయవంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన సహకారాన్ని సెర్ప్ నుంచి అందించనుంది. ఈ యూనిట్ల స్థాపన ద్వారా నెలకు రూ.10 వేలు తగ్గకుండా ఏడాదికి రూ.లక్షకుపైగా ఆదాయం లభించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. జిల్లాలో వెలుగు, పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు 1.18 లక్షల మంది మహిళల్ని ఇప్పటి వరకు లఖ్‌పతీ దీదీలుగా గుర్తించారు. వీరిలో 7,050 మందికి ఈ ఏడాది రుణాలు అందజేసి యూనిట్లను స్థాపించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఈ పథకాన్ని ఆదివారం ప్రధాని మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలుతోపాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పొదుపు సంఘాల మహిళలు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. తొలి విడతగా ఈ పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన 7,050 మందికి అధికారులు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సంబంధిత సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

- నేడు లఖ్‌పతీ దీదీ పథకం ప్రారంభం
- తొలి విడత జిల్లాలో 7,050 మంది పొదుపు మహిళల ఎంపిక
- స్వయం ఉపాధి కోసం రుణాలు
- అన్ని మండలాల్లో ప్రధాని మోదీ సందేశం వినిపించేలా ఏర్పాట్లు



మృతిచెందిన లోకేష్‌రెడ్డి (ఫైల్)



గల్లంతైన మణికంఠారెడ్డి (ఫైల్)



గల్లంతైన కిరణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థుల గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మిగిలిన ఇద్దరి కోసం గాలింపు

ఈత సరదా మూడు కుటుంబాలకు శోకాన్ని మిగిల్చింది. ఉధృతంగా ప్రవహిస్తున్న సాగర్ కాలువలో ముగ్గురు విద్యార్థులు ఈతకు దిగి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన దర్శి పట్టణ సమీపంలో శనివారం చోటుచేసుకుంది.

మెయిన్‌లో..

ఎస్పీ డీపీతో మస్కా!

- చాటింగ్‌తో చీటింగ్ చేసేందుకు యత్నం
- అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి
- వెంటనే సదరు నంబర్ బ్లాక్
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ దామోదర్ సూచన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24 : సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల ఫొటోలు డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా పెట్టుకొని అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఏకంగా ఎస్పీ దామోదర్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని ఆయనకు తెలిసిన వ్యక్తి నుంచి నగదు కొట్టేసేందుకు ప్రయత్నించిన ఉదంతం శనివారం వెలుగు చూసింది. దీన్ని గమనించిన సదరు వ్యక్తి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే మోసగాడి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయించారు. తదుపరి చర్యలకు ఆదేశించారు. ఆ మోసగాడు... ఎస్పీ ఫేస్‌బుక్ ఫ్రెండ్‌కు తొలుత 'హలో... హవ్ ఆర్ యూ... వేర్ ఆర్ యూ యట్ ది మూమెంట్' అని మెసేజ్ పంపాడు. అనంతరం మిస్డ్ వాయిస్ కాల్ చేశాడు. ఆతర్వాత కొద్దిసేపటికి చాలా అత్యవసరం, ఆపదలో ఉన్నామంటూ మెసేజ్ చేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు పంపాలని కోరాడు. అయితే ఆ విషయాన్ని ఎస్పీకి ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్ ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఎస్పీ దామోదర్ అప్రమత్తమై వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రముఖుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కొందరు మాయగాళ్లు మోసం చేస్తున్నారన్నారు. ఎవరైనా అత్యవసరమని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు పంపాలని తొందరపెడితే నమ్మవద్దన్నారు. అనుమానంగా ఉంటే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

స్పా సెంటర్‌లో పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేసేందుకు వచ్చిన పోలీసులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 24: ఒంగోలు నగరంలోని ఓ స్పాసెంటర్‌లో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గతంలోనూ ఇదేవిధంగా ఆకస్మిక దాడులు నిర్వహించగా సదరు స్పాసెంటర్‌లలో మహిళలు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న మహిళలను హోంకు పంపించి, స్పాసెంటర్ యజమానితోపాటుగా అక్కడకు వెళ్ళిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో పోలీసులు మరోమారు తనిఖీలు చేయగా అక్కడ మహిళలు లేరు. దీంతో స్పాసెంటర్ యజమానులకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తాలుకా ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన అవగాహన సదస్సు



సదస్సుకు హాజరైన అధ్యాపకులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 24 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిటీ అకాడమీ ఆధ్వర్యంలో మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ఏఐ ఇంజనీరింగ్ అసోసియేట్‌పై అధ్యాపకులకు నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఐసీటీ అకాడమీ టెక్నికల్ ట్రైనర్ అభయ శశికాంత్ దస్‌మోహార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులే కాకుండా అధ్యాపకులు కూడా క్లౌడ్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులతో కొన్ని అప్లికేషన్లను రూపొందింపజేశారు. చివరగా అర్హత పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, విభాగాధిపతి ఎస్.గిరిబాబు, కన్వీనర్ పఠాన్‌బాషా, కోఆర్డినేటర్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఆగస్టు 24: గుమ్మళంపాడు ఎస్సీకాలనీలో పాస్టర్ బిరుదుల జాన్‌బాబు, శోభారాణి, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన చర్చిని శనివారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు ప్రభువు పాటివాడికి సాయం చేసినపుడే తనకు సంతృప్తి అని చెప్పారని, ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డపాటి శ్రీను, ఎన్‌జీపాడు టీడీపీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్, ఆర్.అంకారావు పాల్గొన్నారు.

కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, ఆగస్టు 24: రూడ్‌సెట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పురుషులు ఈ శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కూడా కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు 9492583484 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 24: జిల్లాలో పెన్షనర్లకు ఏ సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరిస్తామని ఖజానా శాఖ ఉపసంచాలకులు జగన్నాథరావు హామీ ఇచ్చారు. పెన్షనర్లకు సంబంధించి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒంగోలులోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు, తాము ఉద్యోగ విమరణ చేసిన కార్యాలయం నుంచి కాకుండా తాము పెన్షన్ పొందుతున్న ఖజానా కార్యాలయం నుంచి పంపే ఏర్పాట్లు చేయాలని పెన్షనర్లు కోరారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు తమ కార్యాలయాల నుంచి పంపే వీలు లేదని, కేవలం పెన్షన్లు బిల్లులు మాత్రమే తాము సమర్పించగలమని జగన్నాథరావు తెలిపారు. సమావేశంలో ఏటీవోలు కె.రాజ్‌కుమార్, ఎలీషారాణి, నివేదిత, శిరీష, నారాయణ, పెన్షనర్లు సంఘం నాయకులు ఆచారి, అంకిరెడ్డి, రాఘురామిరెడ్డి, రామవరావు, జీవీ.శేషయ్య పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా
ఎన్‌ఎన్‌పాడు హైస్కూలు !

చీకటిపడితే ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు

ప్రహరీ లేకపోవడంతో యథేచ్ఛగా రాకపోకలు

పట్టించుకోని అధికారులు



ప్రహరీ, గేటు లేకుండా ఉన్న హైస్కూల్ ప్రధాన ద్వారం

(ఇన్‌సెట్లో) ఇండోర్‌స్టేడియం వద్ద తాగిపడేసిన మద్యం సీసాలు

సంతనూతలపాడు, ఆగస్టు 24: సంతనూతలపాడులో నడిబొడ్డున ఉన్న జడ్పీ హైస్కూలు ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చీకటిపడితే మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంతో సందడిగా ఉంటుంది. ఇక చీకటిపడితే చాలు మందుబాబులు మద్యం బాటిళ్లలో వాలుతున్నారు. గంజాయి బ్యాచ్ కూడా ఇక్కడ సంచరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. హైస్కూలు ప్రాంగణంలో ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టి ఇండోర్‌స్టేడియం నిర్మించింది. అయితే దీని చుట్టూ ప్రహరీ లేక లేకపోవడంతో హైస్కూల్లోని తరగతి గదుల సమీపంలో రాత్రి సమయంలో కొందరు మద్యం సేవించి అక్కడే బాటిళ్ల పగలగొడుతున్నారు. దీంతో గాజుపెంకులు విద్యార్థులను గాయపరుస్తున్నాయి. తాగిపడేసిన సిగిరెట్లు, పెద్ద ఎత్తున తిరుబండారాల చెత్తచెదారం స్కూలు ప్రాంగణమంతా దర్శనమిస్తున్నాయి. ఇంత అపరిశుభ్రత మధ్య విద్యార్థులు చదువులు, ఆటల, పాటలు ప్రశాంతంగా సాగుతాయా అని పలువురు వాపోతున్నారు. హైస్కూల్‌కు గతంలో ఉన్న ప్రహరి గేట్లను మరమ్మతులు చేసి పునర్నిర్మించాలని గత ప్రభుత్వ హయంలో పనులు చేపట్టారు. అయితే ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీనివల్ల హైస్కూల్‌కు ప్రహరి లేక, గేట్లు ఏర్పాటు చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నాయి. ఇకనైన సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో హైస్కూల్ ప్రాంతంలో గస్తీ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ-పంటతో అన్నదాతకు భరోసా

- పంట నష్టపోతే పరిహారం
- ఈసారి కౌలు రైతులకూ అవకాశం
- వచ్చే నెల 15వరకే నమోదు



ఈ-పంట నమోదు కోసం రైతు ఫొటోను తీస్తున్న వ్యవసాయ సహాయకులు

సంతనూతలపాడు, ఆగస్టు 24: కర్షకుల కన్నీటిని తుడిచేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ముందడుగు వేస్తోంది. ధాన్యం కొనుగోలు, 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ, పంటరుణాలపై వడ్డీ రాయితీ, నష్టపరిహారం అందించనుంది. వీటికోసం ఖరీఫ్‌లో పంట సాగుచేసే రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవడం తప్పనిసరి. అవగాహన లేకపోవడంతో ఏటా ఎంతోమంది రైతులు నమోదుకు దూరంగా ఉండి చివరిలో నష్టపోతున్నారు. అయితే పంటసాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులకు కూడా ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించింది. ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలతో ఎంతో మంది రైతులు నష్టపోతున్నారు. అలాంటి సమయంలో ఈ-పంట నమోదు వారికి భరోసా ఇస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సంతనూతలపాడు మండలంలో 2వేల ఎకరాలు పంటల సాగు అంచనా వేయగా ఇప్పటివరకు 1,157 ఎకరాల సాగు చేశారు. అయితే ఇందులో ఈ-పంట నమోదు కేవలం 656 ఎకరాలు చేశారు. ఇక 1,179 మంది కౌలు రైతులకు గాను 969మందికి గుర్తింపుకార్డులు పంపిణీ జరిగింది.

ఈ-పంట నమోదు ఇలా..

ముందుగా రైతు సేవాకేంద్రాల్లో పంట వివరాలు తెలిపి నమోదు చేయించాలి. సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వేనెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్‌నెంబరు, ఆధార్‌నెంబరు అందజేయాలి. అనంతరం భూమి జియో ఫెన్సింగ్ అవుతుంది. రైతు సేవ కేంద్రాల సిబ్బంది పొలానికి వెళ్లి పంట ఫొటోలు తీసి ఈ-పంటలో నమోదు చేసిన అనంతరం రైతు ఫోన్ నెంబరుకు సమాచారం వస్తుంది. దీనిద్వారానే పంట నష్టపరిహారం, రాయితీలు పొందడానికి వీలవుతుంది. కాగా గతం కంటే ప్రస్తుతం ఈ-పంట నమోదు యాప్ సామర్థ్యాన్ని పెంచారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. రైతుల గుర్తింపునకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫోన్‌కు వచ్చే ఓటీపీ, బయోమెట్రిక్, ముఖగుర్తింపు కార్యక్రమం చేస్తున్నారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు దీనిని కొనసాగించి అనంతరం గ్రామసభలు నిర్వహిస్తారు.

వివరాలు సమగ్రంగా..

ఈ-పంటలో వివరాలను సమగ్రంగా పొందుపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతు వివరాలు, పంట రకం, విస్తీర్ణం, నీటి ఆధారం తదితర అంశాలన్ని పొందుపరచాలి. ఉద్యానపంటలకు సైతం ఇది వర్తిస్తుంది. నమోదైన వరిపంటకు సంబంధించి ధాన్యం మొత్తానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుంది. తద్వారా వచ్చే సొమ్మును రైతుల ఖాతాల్లో 48 గంటల్లో జమచేస్తారని పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ప్రకటించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం
- పి.పావని, ఏవో

- సెప్టెంబరు 15వ తేదీ ఈ-పంట నమోదుకు గడువు ఉంది. దీంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనివల్ల బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు వీలుంటుంది. తుఫాన్‌లతో పాటు, వర్షాభావంతో నష్టపోతే ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. రైతులకు రాయితీపై అందే పథకాలు పొందవచ్చు. అన్ని ప్రాంతాల్లో ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామ వ్యవసాయ సహాయకులు కూడా గ్రామాల్లో ప్రత్యేకంగా రైతులతో సమావేశమై ఈ మేరకు వివరిస్తున్నారు.

జిల్లా అభివృద్ధి కోసం వినూత్న ప్రణాళికలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24: జిల్లా అభివృద్ధి కోసం సరికొత్త విధానాలకు రూపకల్పన చేసేలా శాఖల వారీగా జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో అభివృద్ధిపరంగా జిల్లా ఏవిధంగా ఉండాలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉందన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శనివారం పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఆయా శాఖలు చేపట్టిన చర్యలపై సమీక్షించారు. శాఖల వారీగా రెగ్యులర్‌గా ఉండే లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టేందుకు పరిమితం కావద్దని, మన జిల్లాలో ఉన్న అవసరాలు, స్థానిక యువతలో శక్తి సామర్థ్యాలు, మార్కెట్ అవసరాలు, నూతన ధోరణులను గమనించి ఆ దిశగా జిల్లా అభివృద్ధి సాధించేలా దూరదృష్టితో ప్రణాళికలు రూపొందించాలని దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, ప్రాజెక్టులు, గృహనిర్మాణం, పర్యాటకం, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్‌బీ, రవాణా, విద్య, వైద్యం, సంక్షేమం, విద్యుత్, నైపుణ్యాభివృద్ధి శాఖలు సృజనాత్మకతంగా ఆలోచించాలన్నారు. జిల్లా నుంచి పంపించే ప్రణాళికలు ప్రభుత్వం అవసరమైతే రాష్ట్ర స్థాయిలో అమలు పరిచేలా కొత్తదనంతో ఉండాలని, ఈ నెలాఖరు నాటికి అన్నిశాఖలు నివేదికలు రూపొందించి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాలకార్మికులను స్కూళ్లలో చేర్పించాలి

పనిప్రదేశాల్లో గుర్తించినబాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శనివారం చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 1నుంచి ఇప్పటి వరకు 15 మంది బాలకార్మికులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పిల్లలతో పనిచేయిస్తున్న ఆయా సంస్థల యజమానులపై కేసులు నమోదు చేయాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పలు శాఖ అధికారులు మాధూరి, లక్ష్మానాయక్, సుభద్ర, సురేష్‌కుమార్, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీచైతన్యస్కూలులో కృష్ణుడు, గోపికల విషధారణలో చిన్నారులు



గౌతమ్ మోడల్ స్కూలులో చిన్నారుల సంబరాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24: ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య స్కూలులో శనివారం శ్రీకృష్ణాష్టమి పండగను పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషదారణలతో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం ఉట్టిని కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జోసఫ్ తంబి కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త శ్రీనివాస్, ఆర్‌ఐ అనిల్, జోనల్ కో ఆర్డినేటర్ సువర్ణ, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, ప్రైమరీ ఇన్‌చార్జి రజిని, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ ఈటెక్నోలో..



ఉట్టి కొడుతున్న నారాయణ ఈటెక్నో విద్యార్థులు

స్థానిక అంజయ్యరోడ్డులోని నారాయణ ఈటెక్నో ఇంగ్లీషుమీడియం స్కూలులో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలబాలికలు ఆటపాటలతో ఆనందోత్సవాలతో ఉట్టికొట్టి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు జరుపుకోవడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలు చిన్నతనం నుంచే అలవడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌతమ్ మోడల్ స్కూలులో..

ఒంగోలు(విద్య): స్థానిక గౌతమ్ మోడల్ స్కూలు బ్రాంచిల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీప్రైమరీ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్లు ఎం.కొండయ్య, ఎం.పద్మజ, ప్రిన్సిపాల్ ఆలెక్స్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

- ఉప విద్యాధికారి అనితారోజ్‌రాణి

ఒంగోలు(విద్య), ఆగస్టు 24: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని ఉప విద్యాధికారి అనితారోజ్‌రాణి సూచించారు. స్థానిక ప్రకాశంభవన్‌లోని స్పందనహాలులో శనివారం నిర్వహించిన ఇన్‌స్పెయిర్ మనక్ నామినేషన్లు 2024-25పై ఒంగోలు డివిజన్ పరిధిలోని సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచాలన్నారు. ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల రూపకల్పనపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ అవార్డులు విద్యార్థుల్లో చదువుతో పాటు వినూత్న ఆలోచనలు పెంపొందించేలా చూడాలన్నారు. ఎంఈవో కిషోర్‌బాబు మాట్లాడుతూ జిల్లా నుంచి ఎక్కువ నామినషన్లు పంపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ మాట్లాడుతూ ఇన్‌స్పెయిర్ నామినేషన్లను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తప్పని సరిగా పంపించాలన్నారు. హైస్కూళ్ళు ఐదు, యూపీ స్కూళ్ళు మూడు నామినేషన్లు చేయాల్సి ఉంటుందన్నారు. బి.తిరుపతయ్య, కె.రాము, పీవీ.రమణయ్య, ఎన్.నాగేశ్వరరావు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. డివిజన్ పరిధిలోని సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుబ్బారావు



గ్రోత్‌సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, ఆగస్టు 24: పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేర్నమిట్టలోని పరిశ్రమల సముదాయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అచ్చుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాకంపెనీలో ప్రమాదం జరిగి 18 మంది మరణించారని, 45 మంది క్షతగాత్రులైయ్యారని, ఇందుకు కారకులను శిక్షించాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు పరిశ్రమ ల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో బంకా సుబ్బారావు, షేక్.మస్తాన్, కృష్ణారెడ్డి, శ్రీను, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మద్దిపాడు: పలువురు కార్మికుల మరణానికి కారణమైన ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం ప్రమాదాన్ని చిన్నదిగా చిత్రీకరించటానికి యాజమాన్యం ప్రయత్నిస్తుందని, వెంటనే ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవటంతో పాటు కార్మికుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖాశీం, ఆదిలక్ష్మి, సాయి, టి.శంకర్, అబ్దుల్ ఖాన్, రవి, వసంత, మౌళిక, కృష్ణవేణి, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కార్పొరేషన్ పరిధిలో అనుమతిలేని స్థలాలు, ప్లాట్‌లు కొని మోసపోవద్దు

- నగరపాలక సంస్థ అధికారుల ప్రకటన

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 24 : ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేని స్థలాలు, ప్లాట్‌లు కొనుగోలు చేసి మోసపోవద్దని నగరపాలక సంస్థ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్ట, ముక్తినూతలపాడు, ఒంగోలు నగరం, త్రోవగుంట, కొప్పోలు, గుడిమెళ్ళపాడు, కొత్తమామిడిపాలెం, పెళ్ళూరు, వెంగముక్కలపాలెం, చెరువుకొమ్ముపాలెం, అన్నవరప్పాడు, నరసాపురం అగ్రహారం, ప్రాంతాలలో ఎటువంటి అనుమతులు లేని లేఅవుట్‌లను గుర్తించినట్లు పేర్కొన్నారు. అనధికారకంగా వేసిన ప్లాట్ల లేఅవుట్‌తో కూడిన జాబితా (377)ను ప్రకాశం జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, ఈ లేఅవుట్లలో స్థలము/ప్లాట్లు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని, వీటికి రిజిస్ట్రేషన్, ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు ఉండదని తెలిపారు. రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని అధికారులు స్పష్టం చేశారు. స్థిరాస్తులు కొనుగోలు చేసేటపుడు మోసపోకుండా వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను పరిశీలించుకోవాలని ప్రజలకు సూచించారు.

నగరంలో మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 24: కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలో మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ ఎం.రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 70సచివాలయాల పరిధిలో జరిగే ఈ సర్వేలో ఎక్కడైనా మాన్యువల్ స్కావెంజర్స్‌ను గుర్తించినట్లయితే వెంటనే నగర కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ఇన్ శానిటరీ మరుగుదొడ్లు గుర్తిస్తే తెలియజేయాలన్నారు. తదనంతరం అధికారులతో తనిఖీ చేయించి శానిటరీ లెట్రిన్స్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు. పదిహేను రోజులలోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించాలని సూచించారు.

మెడికల్ పీజీలో ఉత్తమ ర్యాంకు



మలినేని దివ్యస్పందన

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 24 : నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(పీజీ)లో ఒంగోలుకు చెందిన మలినేని దివ్యస్పందన అనే విద్యార్థిని 6,882 ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. నగరానికి చెందిన స్నేహ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మలినేని నరేంద్రబాబు కుమార్తె దివ్యస్పందన ఎంబీబీఎస్ విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివారు. ఈ సందర్భంగా పలువురు దివ్యస్పందనను అభినందించారు.

రేపు నగరంలో నిరసన ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24: గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ముస్లిం జాగరణ్‌మంచ్ రాష్ట్ర కన్వీనర్ షేక్ మహ్మద్ బుజ్జి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ మహిళా నాయకురాలు, మరో మాజీ ఎమ్మెల్యే పీఏలు కలిసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. బాధితులకు న్యాయంచేయాలని, నిరుద్యోగులను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ర్యాలీలో నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పని సర్దుబాటు మండలానికే పరిమితం చేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 24: ఉపాధ్యాయుల పని సర్దుబాటును మండలానికే పరిమితం చేయాలని ఆపస్ సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌కుమార్, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు కె.మల్లికార్జునరావు, టి.దిలీప్‌చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్‌జీటీలను బలవంతంగా హైస్కూళ్ళకు పంపడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల అంగీకారంతో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఐఆర్ ప్రకటించాలి: ఉద్యోగులకు దసరా కానుకగా మధ్యంతర భృతిని 30శాతం ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.బాలాజీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళంగా మారిందని, దీనివల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముందుగా ప్రమోషన్లు చేపట్టి ఇంకా అవసరమైతే విద్యా వలంటీర్లను నియమించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ఏకేయూలో కొత్త కోర్సులు ప్రారంభించాలి



వీసీ మూర్తికి బొకే అందజేస్తున్న అనిలాకుమారి

ఒంగోలు(విద్య), ఆగస్టు 24 : ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వచ్చే ఏడాది నుంచి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కొత్త కోర్సులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పాలకమండలి సభ్యురాలు కె.అనిలాకుమారి కోరారు. యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తిని శనివారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కోర్సులకు సంబంధించిన వివిధ అంశాలపై వారు చర్చించారు.

ఇంటింటి సర్వే పరిశీలన

సంతనూతలపాడు, ఆగస్టు 24: సంతనూతలపాడు సచివాలయం-1,2, ఎండ్లూరు, మైనంపాడు, పేర్నమిట్ట పరిధిలోని సచివాలయాల్లో ఆదివారం జరిగిన ఇంటింటి సర్వేను తహసీల్దార్ ఆదిలక్ష్మి తనిఖీ చేశారు. రిసర్వేకు సంబంధించి బీఎల్‌వోల రికార్డులను పరిశీలించారు. ఓటర్ల ప్రక్రియలో సవరణలు, చేర్పులు, తొలగింపులు పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు.


తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ మురళి

కొండపి, ఆగస్టు24: కొండపి తహసీల్దార్‌గా పసుపులేటి మురళి శనివారం ఉదయం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వెలుగొండ ప్రాజెక్టులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మురళి అడహాక్ ప్రమోషన్ పొంది తహసీల్దార్‌గా కొండపి బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర రెవెన్యూ సేవలు అందిస్తానని ఈసందర్భంగా మురళి తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన ఎన్నికల డీటీ నాగరాజు రెవెన్యూ కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు మురళికి బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

రైల్వే లైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాగశ్రీను

టంగుటూరు, ఆగస్టు 24 : టంగుటూరు రైల్వే బ్రిడ్జి వద్ద జరుగుతున్న మూడో లైన్ నిర్మాణ పనులను శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను పరిశీలించారు. రెండు నెలలుగా మూసి వేసి ఉన్న బ్రిడ్జి కింద రోడ్డు మార్గాన్ని గురువారం వదిలారు. ఇంతకాలం ఉన్న ప్రధాన రైల్వేగేటు మార్గం ఒక్కటే కావడంతో వాహన చోదకులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రైల్వే డిపార్ట్‌మెంట్ వారు పనులు ముగించి బ్రిడ్జి కిందుగా పాతదారిని ఇచ్చారు. దారిచ్చాక కూడా ఇదే దారిలో మరికొన్ని పనులు జరుగుతున్నాయి. ఈ పనులను స్వయంగా పరిశీలించిన టీడీపీ నాయకుడు త్వరగా దారికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మీపనులకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ వెళ్తున్నందున దారిని యథాతథంగా కొనసాగించాలని రైల్వే అధికారులను కోరారు.

ఒంగోలులో ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24 : జిల్లాలోని రైతులకు అనేక సేవలు అందించిన ఏరువాక కేంద్రాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నర్సరావుపేటకు తరలించారని, అందువల్ల టీడీపీ కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని తిరిగి ఒంగోలుకు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల ప్రతినిధి మండవ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి జిల్లాలో ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఒంగోలులోని వయవసాయ మార్కెటింగ్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం రైతులకు విశేష సేవలను అందిస్తూ వచ్చిందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నర్సరావుపేటకు తరలించడం వల్ల రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నంద్యాలకు తరలించిన ఏరువాక కేంద్రాన్ని తిరిగి కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అక్కడి ప్రజాప్రతినిధులు వత్తిడి తేవడంతో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయవిశ్వవిద్యాలయం కులపతి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అదే విధంగా ఒంగోలులో ఏరువాక కేంద్రం ఏర్పాటు చేసేలా జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత గౌరవం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



చలమయ్యకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి, ఆగస్టు 24 : పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తెలుగుదేశంలో సముచిత గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మన టీడీపీ యాప్ ద్వారా సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటంలో టాప్‌స్కోరర్‌గా నిలిచిన చీమకుర్తి పట్టణానికి చెందిన ముప్పూరి చలమయ్యకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు పంపిన ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానానికి కార్యకర్తలను మరింత చేరువ చేసేవిధంగా మన టీడీపీ యాప్ ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వెల్లంపల్లిలో మాట్లాడుతున్న ప్రత్యూష

మద్దిపాడు, ఆగస్టు 24: మిరపనారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి డి.ప్రత్యూష పేర్కొన్నారు. శనివారం వెల్లంపల్లి, కొలచనకోటలోని మిరపనారు నర్సరీని ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా చీడపీడలను అరికట్టవచ్చన్నారు. రైతులకు నారు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, మొక్కల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని చెప్పారు. లైసెన్స్ లేకుండా నర్సరీలో నారు విక్రయించకూడదని, ఉద్యానశాఖ ద్వారా పూలతోటలు, పండ్లతోటల, కూరగాయలు సాగు చేసే రైతులకు రాయితీలను అందజేస్తుందని తెలిపారు. అదేవిధంగా డ్రిప్, స్ప్రింకర్లకు కూడా రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం మొదలైందని, ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

సింగరాయకొండ తహసీల్దార్‌గా రవి



బాధ్యతలు స్వీకరించిన రవి

సింగరాయకొండ, ఆగస్టు 24 : సింగరాయకొండ నూతన తహసీల్దార్‌గా టి. రవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా సింగరాయకొండ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు కలిసి అభినందనలు తెలిపారు.

దుకాణదారులకు కౌన్సెలింగ్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కొండపి, ఆగస్టు24: కొండపిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులకు, వాహనదారులకు కొండపి సీఐ సోమశేఖర్ శనివారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపై అడ్డంగా వాహనాలను నిలిపితే జరిమానాలు విధిస్తామని వారిని హెచ్చరించారు. రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టకుండా దుకాణదారులే నిలువరించాలని, ఖాళీ ప్రదేశాల్లో, రాకపోకలకు అంతరాయం లేకుండా వాహనాలను నిలుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు పాటించాలని, దుకాణాల వారు కూడా అందుకు సమకరించాలని సూచించారు. పొదిలిరోడ్డు, మద్దులూరు రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, జెండాచెట్టు పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఈసందర్భంగా సిబ్బందికి కూడా సూచించారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు బొకే అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 24: నాగులుప్పలపాడులో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను టీడీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, నాయకులు బెల్లం వెంకటేశ్వర్లు, మండవ వాసుబాబు, మెట్టు సుబ్బయ్యనాయుడు, మండే బాబురావు తదితరులు తహసీల్దార్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూసంబంధ, ఇతర రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా తక్షణమే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ర్యాగింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

చీమకుర్తి, ఆగస్టు 24 : కళాశాలల్లో ర్యాంగింగ్‌కి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. చీమకుర్తి పట్టణంలోని బీవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ర్యాంగింగ్, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కల్గి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ గేమ్స్, ఇతర మోసాల పట్ల జాగురకతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



ట్యాబ్ ఆధారిత పరీక్షను పరిశీలిస్తున్న ఏఎంవో రమేష్

చీమకుర్తి, ఆగస్టు 24: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్ బాటకు మార్గదర్శనం చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ అన్నారు. ట్యాబ్స్ ఆధారిత అసెస్‌మెంట్ పరీక్షల సరళిని ఆయన శనివారం చీమకుర్తి పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుతోనే ప్రభుత్వ స్కూళ్ల మనుగడ



శివాజీ, రమేష్‌లను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 24: ఉపాధ్యాయుల ఉత్తమ పనితీరుతోనే ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ ఉంటుందని ఎంఈవో శివాజీ తెలిపారు. ఉత్తమ ఎంఈవో అవార్డు పొందిన శివాజీ, విద్యా కరికులంపై డాక్టరేట్ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పెట్లూరి రమేష్‌లను శనివారం చీమకుర్తిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ తనకి దక్కిన గౌరవం మండలంలోని ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. డాక్టరేట్ సాధించిన నాయుడుపాలెం హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు రమేష్‌ని అభినందించారు. కార్యక్రమంలో బి.శేషారావు, జె.యాకోబు, ఎ.హరిబాబు పాల్గొన్నారు.

భర్త మర్మాంగాన్ని కోసేసిన రెండో భార్య

● తొర్రగుడిపాడులో ఘటన
● ఇరువురూ బిహార్‌వాసులే

చీమకుర్తి, ఆగస్టు 24 : వేధింపులు తట్టులేక భర్త మర్మాంగాన్ని రెండో భార్య కోసేసింది. ఈ ఘటన చీమకుర్తి మండలం తొర్రగుడిపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సీఐ సుబ్బారావు కథనం మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన విజయ్‌యాదవ్ తొర్రగుడిపాడులోని డెయిరీ ఫాంలో పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య, పిల్లలు బిహార్‌లో ఉంటున్నారు. రెండో భార్య సీతాకుమారితో కలిసి విజయ్‌యాదవ్ తొర్రగుడిపాడులో ఉంటున్నారు. సీతాకుమారి ఆరు నెలల గర్భిణి. ఆమెను తరచూ భర్త వేధిస్తున్నాడు. ఆమె పనిచేసినందుకు వచ్చిన డబ్బులు మొత్తం తీసుకొని ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. ప్రశ్నిస్తే కొడుతున్నాడు. పైగా మొదటి భార్యకు డబ్బులు పంపుతున్నాడు. దీంతో కోపం పెంచుకున్న సీతాకుమారి శనివారం మధ్యాహ్నం మంచం మీద నిద్రిస్తున్న విజయ్‌యాదవ్ మర్మాంగాన్ని చాకుతో కోసేసింది. తర్వాత రక్తం మడుగులో ఉన్న భర్తని చూసి భయపడి విషయాన్ని డెయిరీఫాం యజమానికి ఫోన్ ద్వారా తెలిపి పారిపోయింది.

సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఫోన్ ట్రాకింగ్ ద్వారా సీతాకుమారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సోలార్‌తో నాణ్యమైన విద్యుత్

● మంత్రి గొట్టిపాటి రవికుమార్
● మారెళ్లలో ప్రాజెక్టు ప్రారంభం



సోలార్ పవర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్, లక్ష్మి

ముండ్లమూరు, ఆగస్టు 24: సోలార్‌తో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎంతో ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. వాతావరణంలో కూడా కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెం వద్ద 14 ఎకరాల్లో రూ.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగా హైడ్రోజన్, విండ్ వీఎస్పీ మరికొన్ని పద్ధతుల్లో ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుకు పనికిరాని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అందుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిందని మంత్రి రవికుమార్ ధ్వజమెత్తారు. సోలార్ ద్వారా ఒక్క యూనిట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. జల, థర్మల్ విద్యుత్తులు అధిక వ్యయంతో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పక్క రాష్ట్రాల కంటే తమ బినామీ సంస్థల ద్వారా విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 56 రోజుల్లోనే 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యుత్ వైరు కొరతతో కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లోనే కండక్టర్లు వచ్చిన వెంటనే కనెక్షన్లు అందజేస్తామన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలు అధికమయ్యాయని మంత్రి రవికుమార్ పేర్కొన్నారు. కాపర్ బదులు అల్యూమినియం వాడితే దొంగతనాలు నివారించవచ్చని చెప్పారు. దొంగలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని కొనే షాపుల యజమానులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతమైన మారెళ్లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసిన సినీ నిర్మాత అశోక్‌బాబును మంత్రి రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, డాక్టర్ లలిత్‌సాగర్, ప్లాంట్ నిర్వాహకులు అశోక్‌కుమార్, ఎస్ఈ సత్యనారాయణ, సీఈవో ఉన్నం నవీన్, సీవోవో ఆర్తీక, బాషా కరీమ్, ఏడీ పిచ్చయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, సుంకర రాఘవరెడ్డి, మేదరమెట్ల వెంకటరావు, మట్టా సుబ్బారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గల్లంతుతో..మూడు గ్రామాల్లో విషాదచాయలు

బాధిత కుటుంబాలను పరామర్శించిన గొట్టిపాటి లక్ష్మి



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, ఆగస్టు 24: సాగర్ కాలువలో ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు గల్లంతు కావటంతో మూడు గ్రామాల్లో విషాదచాయలు నెలకొన్నాయి. మండలంలోని కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన పోతిరెడ్డి లోకేష్‌రెడ్డి, కుందుర్రు కిరణ్‌కుమార్‌రెడ్డి, బత్తుల మణికంఠారెడ్డిలు పదో తరగతి నుంచి మంచి స్నేహితులు. వారి తల్లిదండ్రులు సామాన్యరైతు కుటుంబీకులు. వ్యవసాయంపై జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. కొత్తపల్లికి చెందిన దానియేల్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో లోకేష్‌రెడ్డి, సోదరి దర్శిలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్నారు. లక్ష్మీనారాయణపురంకు చెందిన కుందుర్రు వెకంట నారాయణ, లక్ష్మమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిలో కిరణకుమార్‌రెడ్డి స్థానిక ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కొర్లమడుగుకు చెందిన జయరామిరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో మణికంఠారెడ్డి నూజివీడులో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. తమలా పిల్లలు కష్టపడకూడదన్న ఉద్దేశ్యంతో సన్నకారు రైతులైనప్పటికి పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంతో ఆశపడిన వారి ఆశలు అడియాశలయ్యాయి. చేతికి అందివచ్చి న సమయంలో అకాల మృత్యువు కబలించటంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మూడు గ్రామాల్లోని ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోకేష్‌రెడ్డి మృతదేహం లభించింది. మిగిలిన ఇద్దరి మృతదేహాల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురి దుస్తులు, చెప్పులు, మోటార్ సైకిల్ ఒకే చోట ఉండటంతో ముగ్గురు కాల్వలో మునిగి గల్లంతయినట్లు నిర్ధారించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సాగర్ కాలువలో గల్లంతయిన విద్యార్థుల కుటుంబాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరామర్శించి ఓదార్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసి మిగిలిన ఇద్దరి ఆచూకీ కనుగొనాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళి సిబ్బంది, గజఈతగాళ్లతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● చీరాల ఎమ్మెల్యే కొండయ్య



ఇంద్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 24 : ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య చెప్పారు. చీరాల ఆర్టీసీ డిపోలో నూతనంగా చీరాల, హైదరాబాద్‌కు ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్సులో తొలి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తుందన్నారు. అందులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణానికి సంబంధించిన హామీని త్వరలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా మహిళలు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బస్ డిపో మేనేజరు శ్యామల, బస్సు డ్రైవరు, కండక్టరు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధింపులపై మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

● కొండారెడ్డి పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న కొండారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24 : మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జీవీ.కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివార అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు షర్మిళ అధ్యక్షతన జరిగాయి. జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో కొండారెడ్డి మాట్లాడుతూ మహిళలపై నిత్యం జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులు, హింస ఎదుర్కోవాలంటే మహిళలందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రకటనలకు, ఉపన్యాసాలకు తప్ప పరిష్కారానికి మార్గాలు వెతకడం లేదని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాను, మద్యం నియంత్రణ చేయడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లే మహిళలపై ఇటువంటి దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో రమాదేవి, ఎన్.మాలతి, నాగూర్, యు.రాజ్యలక్ష్మి, కె.ప్రసన్న, జి.భానుమతి, ఎ.విశ్రాంత, కృపావతి, నాగేంద్రం, బి.పెద్దగోవిందమ్మ, పి.ప్రేమలత, ఎస్‌కే.మదారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

మార్టూరు, ఆగస్టు 24 : మండలంలోని జొన్నతాళి సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న పసుమర్తి డానియేలు అనే వృద్ధుడిని కారు ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో డానియేలు రోడ్డు పక్కన డివైడర్ పైకి ఎగిరి పడిపోయారు. దాంతో అతని కాలికు గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇసుకదర్శి గ్రామానికి చెందిన డానియేలు జొన్నతాళి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చిత్తూరు జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి కారు విజయవాడ వెళ్తుండగా ఢీకొట్టింది. డానియేలును ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒంటరి మహిళ ఇంట్లో చోరీ

● పోలీసుల అదుపులో నిందితుడు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 24 : దత్తక్షేత్రం సమీపంలో నాగమణి అనే ఒంటరి మహిళ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి ఒంగోలు రిమ్స్‌లో పనిచేస్తుంది. ఎప్పటి మాదిరిగా ఆమె డ్యూటీకి వెళ్లింది. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళం కోసి తీసి ఉంది. ఇంట్లో బీరువాలో ఉన్న రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.48వేల నగదుతో పాటు టీవీ చోరీ అయినట్లు బాధితురాలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

రంగస్థల నటి బండారు పద్మావతి మృతి



పద్మావతి(ఫైల్)

అద్దంకి, ఆగస్టు 24 : ప్రముఖ రంగస్థల నటుడు బండారు రామారావు కుమార్తె రంగస్థల నటి, టీవీ ఆర్టిస్ట్, రేడియో ఆర్టిస్ట్ బండారు పద్మావతి శనివారం నెల్లూరులో మృతి చెందారు. అద్దంకి పట్టణానికి చెందిన పద్మావతి నెల్లూరులో స్థిరపడ్డారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ పద్మావతి పలు పౌరాణిక పాత్రలతో జనాదరణ పొందారు. పద్మావతి మృతి పట్ల అద్దంకి నియోజకవర్గ కళాకారుల సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆవులకు గ్రాసం వితరణ

గిద్దలూరు, ఆగస్టు 24 : కబేళానికి తరలిస్తుండగా, పట్టుబడిన ఆవుల సంరక్షణ బాధ్యతను పలువురు దాతలు స్వీకరించారు. గిద్దలూరు మార్కెట్ యార్డులోని 75 ఆవుల సంరక్షణ కోసం 500 కట్టల పశుగ్రాసాన్ని నంద్యాల నుంచి శనివారం తెప్పించారు. ఆవులు నీరు తాగేందుకు తొట్లను ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులను పిలిపించి కొన్ని ఆవులకు చికిత్సలు చేయించారు. దేవాలయాల సమన్వయ కమిటీ, ఆర్ఎస్ఎస్, సమరసత సేవా ఫౌండేషన్, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు బాధ్యతను తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, కృష్ణారావు, యర్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీసీఏ అధ్యక్షులుగా మోహన్‌దాస్



నాగిశెట్టి మోహన్‌దాస్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 24 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన న్యాయవాది నాగిశెట్టి మోహన్‌దాస్‌ను నియమించారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో కో ఆప్టడ్ అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు పలువురు ఏసీఏ, పీడీసీ, క్రికెటర్లు మోహన్‌దాస్‌ను అభినందించారు.

నేడు జిల్లా సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, ఆగస్టు 24: జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనంపాడు జడ్పీహైస్కూల్లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ బాల, బాలికల జట్ల ఎంపికలు జరగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో సెప్టెంబరు 13, 14, 15 తేదీల్లో జరిగే అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ షిప్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జననధృవీకరణ, పదో తరగతి మార్కులిస్టు ధృవీకరణ పత్రాలు తీసుకుని మైనంపాడు జడ్పీహైస్కూల్ వద్దకు రావాలని తెలిపారు. ఎంపికలకు 2009-01-02 తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ రవి కుమార్ సెల్.9010613146, 9849429839 లను సంప్రదించాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

టంగుటూరు, ఆగస్టు 24 : టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో శనివారం హెచ్‌ఐవీపై 'మీకు తెలుసా' అనే అవగాహనా కార్యక్రమాన్ని మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తులసీప్రభ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాప్తి, నివారణపై ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ ల్యాండ్ సొసైటీ మేనేజర్ ఆర్. శ్రీనివాసరావు పాఠశాల స్టాఫ్ కార్యదర్శి జి. యాకోబ్, పీఈటీ యరమాల అరుణకుమారి, ఉపాధ్యాయులు, 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ. 359

టంగుటూరు, ఆగస్టు 24 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ. 359 రైతులకు దక్కింది. కారుమంచి రైతులు తెచ్చిన 768 పొగాకు బేళ్లకు వేలం జరుగగా అందులో 689 కొనుగోలు కాగా, మిగిలిన బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలంలో గరిష్ఠ ధర రూ. 359, కనిష్ఠ ధర రూ. 205, సగటు ధర రూ. 309.73 పలికింది. పలు కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు చేయరూ!

● త్రిపురాంతకం రోడ్డులో అడుగుకో గుంత ● వర్షాకాలంలో మరిన్ని అవస్థలు ● ఐదేళ్లుగా నిలిచిన గంగవరం రోడ్డు


అధ్వానంగా ఉన్న గంగవరం- పుల్లలచెరువు రహదారి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 24 : ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వైపు వెళ్లే ఆర్అండ్‌బీ వెంబడి అడుగులోతు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో ఈ గోతుల్లో నీరు నిలుస్తోంది. దీంతో ఈ రోడ్డు పక్కన నడిచి వెళ్లే పాదచారులపై వాహనాల రాకపోకల సమయంలో బురదనీరు చింది పాదచారులపై పడుతోంది. ఇది రాష్ట్ర రహదారి కావడంతో ఈ రోడ్డుపై నిత్యం వాహనాలు ఎక్కువగానే తిరుగుతున్నాయి. ఎర్రగొండపాలెం నుంచి గుంటూరు, విజయవాడ పట్టణాలకు ఆర్టీసీ, ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు ఎక్కువగానే ఈ మార్గంలో వెళుతుంటాయి. విజయవాడ డిపో, వినుకొండ డిపో బస్సులు ఈ మార్గంలో నడుపుతున్నారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల ప్రజలు గుంటూరు, విజయవాడ వైద్యశాలలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల మధ్య ఆటోలు నడపాలంటే ఆటో డ్రైవర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఇంచుమించు ఏడు కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులకు గురైంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గుంతలు పూడ్చించాలని రెండు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుల్లలచెరువు : మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా అడుగడుకో గుంత మాదిరిగా రోడ్లు తయారయ్యాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అన్న వ్యత్యాసం లేకుండా దాదాపు అన్ని రోడ్లది ఇదే పరిస్థితి గత వైసీపీ ప్రభుత్వ కాలంగా రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్డుల్లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు బంబేలేత్తుతున్నారు. ప్రధానంగా మండలంలోని ముటుకుల-గుట్లపల్లి, గంగవరం-పుల్లలచెరువు, చాపలమడుగు- మిట్టపాలెం, మానేపల్లి- ముటుకుల, కవలకుంట్ల-పుల్లలచెరువు, పుల్లలచెరువు-గారపెంట,రంగనపాలెం-కుందంపల్లి, మానేపల్లి-అయ్యాగానిపల్లె, ముటుకుల-రెంటపల్లి, ముటుకుల-పుల్లలచెరువు, చాపలమడుగు-సి కొత్తపల్లి రోడ్డుల్లో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక రోడ్డుల్లో బారకు ఒక గుంతవుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


గుంతలమయమైన ఎర్రగొండపాలెం- త్రిపురాంతకం రహదారి

చిప్స్ పరిచారు- రోడ్డు మరిచారు

పుల్లలచెరువు మండలానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గంగవరానికి గత 75 ఏళ్లుగా సరైన రోడ్డు లేదు. దీంతో గ్రామ ప్రజలు నిత్యం పుల్లలచెరువుకు నిత్యవసరాలు, వ్యవసాయ అవసరాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏళ్ల తరబడి రోడ్డు లేకపోవడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గుర్తించిన నాటి టీడీపీ ప్రభుత్వ హాయంలో 2019లో ప్రత్యేక ప్యాకేజీ కింద రోడ్డు మంజూరు చేసింది. అయితే పనులు మొదలు పెట్టి చిప్స్ తోలగానే 2019 ఎన్నికల కోడ్ వచ్చింది. అప్పటి నుంచి రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం కాంట్రాక్టరు మరోసారి రెండవ లేయరు చిప్స్ పోశారు. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో బిల్లులు రాక రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నిర్మాణం కోసం తోలిన చిప్స్ లేచిపోయి వర్షం పడిన పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా, పనులు నిలిచిపోయినా అధికారులు కాని, వైసీపీ ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకున్న పాపన పోలేదు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసుల రాజీతో సమాజంలో శాంతి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్


మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 24 : లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేయడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. సెప్టెంబరు 14న జరిగే, జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా గిద్దలూరు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు పరిధిలోని ఆరు మండలాల పోలీసు అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి సామరస్యపూర్వకంగా తమ కేసులను రాజీ చేసుకుని పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్లు తప్పనిసరిగా వాడాలని ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారా దానమ్మ మాట్లాడుతూ ఇరుపార్టీలు పరస్పరం ఒకరిమీద మరొకరు ఆవేశంలో పెట్టుకున్న కేసులను రాజీ చేయడానికి జాతీయ లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్, భరణం, బ్యాంక్‌ల ప్రీ లిటికేషన్, బీఎస్ఎన్ఎల్ కేసులు ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్, కొమరోలు, కంభం, రాచర్ల ఎస్సైలు కె.మధుసూదన్‌రావు, బి.నరసింహారావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

మార్కాపురం, ఆగస్టు 24: వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీ అన్నారు. స్థానిక కోర్టు హాలులో శనివారం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా వీలైనన్ని కేసులను పరిష్కరించాలన్నారు. ఇరుపక్షాలతో ముందుగా మాట్లాడి వారు అంగీకరిస్తే పరిష్కారం సులువవుతుందన్నారు. చిన్నపాటి కేసులపై ఎక్కువగా దృష్టిపెట్టాల న్నారు. కోర్టు, పోలీసు స్టేషన్‌లలో అనవసర కేసులను సాధ్యమైన మేర తగ్గించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయాధికారి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న న్యాయాధికారి బాలాజీ

మార్కాపురం, ఆగస్టు 24: స్థానిక సబ్ జైలును మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. బాలాజీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఒక్కో రిమాండ్ ఖైదీని పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బెయిల్ తీసుకోవడానికి ఆర్థిక స్థోమతలేకపోతే మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని సమకూరుస్తామన్నారు. సబ్‌జైలులోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, న్యాయ సహాయసేవకుడు ఎస్‌కె బాషలు పాల్గొన్నారు.

ఎస్సైగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

గిద్దలూరు, ఆగస్టు 24 : రాచర్ల ఎస్సైగా కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా నుంచి ఆయన బదిలీపై రాచర్ల ఎస్సైగా వచ్చి శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు సహకరించాలని, పేకాట, మట్కా లాంటివి సహించబోనని పేర్కొన్నారు.

వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 24 : ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అర్బన్ సీఐ సురేష్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని రాచర్ల గేటు కూడలిలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం గురించి అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకంతో ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చన్నారు. ఇక నుండి హెల్మెట్ వాడాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

ఎస్.ఐగా చౌడయ్య బాధ్యతల స్వీకరణ



ఎర్రగొండపాలెం, ఆగస్టు 24 : ఎర్రగొండపాలెం ఎస్ఐగా పి .చౌడయ్య శనివారం సాయంత్రం విధులకు హజరై బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు ఎస్ఐగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన స్పందిస్తూ, ట్రాఫిక్ సమస్య నివారణపై ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు.

ప్రయాణికులకు నిలువ నీడేది?

● గతంలో ఉన్న సత్రాన్ని కూల్చిన అధికారులు ● ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పొదిలి ప్రధాన పెద్దబస్టాండ్ కూడలి

పొదిలి, ఆగస్టు 24 : పట్టణంలోని పెద్దబస్టాండ్ కూడలి నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో అటు దర్శి, ఇటు చీమకుర్తి, మర్రిపూడి మండలాలకు చెందిన వివిధ అవసరాలకోసం వచ్చే ప్రయాణికులతో జన సమర్ధంగా ఉంటుంది. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్టాండ్ కూడలిలో బాలికల ఉన్నత పాఠశాల దక్షిణం వైపు గోడకు పంచాయతీ రేకులుషెడ్డు నిర్మించింది. అప్పట్లో ప్రయాణికులు బస్సుల రాకపోకల కోసం రేకులషెడ్డులో వేచి ఉండేవారు. ఎండకు వానకు ఇబ్బంది పడకుండా ఆశ్రయం పొందే వారు. కాలక్రమేణ చిరువ్యాపారులు రేకుల షెడ్డును ఆక్రమించుకొని వ్యాపారం చేసుకోవడం మొదలైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్ నిర్మాణం చేయాలనే ఉద్దేశ్యంతో ఆ ప్రాంతంలో ఉన్న భారీ వృక్షాలను రేకుల షెడును తొలగించి పునాదులు వేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పునాదులకే అన్నా క్యాంటీన్ పరిమితమైంది. దర్శి, అద్దంకి, కురిచేడు, మర్రిపూడి, కొండపి, ఒంగోలు, చీమకుర్తి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వారివారి గ్రామాలకు వెళ్లేందుకు బస్సులకోసం బస్టాండ్‌లో వేచి ఉండాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఇక్కడ వేచి ఉండే ప్రయాణికులు ఎండుకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం వందలాది మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరేందుకు గంటల తరబడి ఇక్కడ వేచి ఉంటున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. దీంతో తమ అవస్థలు వర్ణానాతీతంగా ఉన్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని మరుగుదొడ్లను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమించుకునేందుకు వైసీపీ నాయకులు మరుగుదొడ్లను కూల్చి వేసిన సంగతి తెలిసిందే. పట్టణం నడిబొడ్డులోని మరుగుదొడ్లు కూల్చినప్పటికీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూశారు. ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాలకులు ప్రజల అవసరాలకోసం బస్‌షెల్టర్ నిర్మాణంతోపాటు మరుగుదొడ్లను నిర్మించి మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24: ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు మార్కాపుంలోని పలు పాఠశాలల్లో శనివారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. సాంప్రదాయ బద్ధంగా ఉట్టికొట్టారు. సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి, ఇన్‌చార్జులు సుహాసిని, కృష్ణవేణిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్, డైరెక్టర్ కందెపు రంగయ్య ఆధ్వర్యంలో కృష్ణుని నృత్యాలు, లీలలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కమలా పాఠశాలలో కమలా విద్యాసంస్థల ఛైర్మన్ పెనుగొండ పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఓంసాయి వికాస్ విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ వై.చలమయ్యల ఆధ్వర్యంలో పూజలు, కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని 45వ అంగన్‌వాడీ సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.


వాసవీ పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు


సాయిబాలాజీలో గోపికలగా చిన్నారులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, ఆగస్టు 24: పొదిలి నగరపంచాయతీ పారిశుధ్య కార్మికులకు మార్కాపురం శాసన సభ్యులు నారాయణరెడ్డి చేతుల మీదుగా శనివారం దుస్తులు, నిత్యావసరాలు అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా కార్మికులకు రావాల్సిన దుస్తులు, పాదరక్షలు, సబ్బులు, కొబ్బరి నూనెలను ప్రస్తుత ప్రభుత్వం అందజేసిందని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్ చెప్పారు. నగర పంచాయతీ శుభ్రంగా ఉండాలంటే కార్మికుల పాత్ర కీలకం అన్నారు. వారు చేస్తున్న పారిశుధ్య కార్యక్రమాల వల్లే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పొదిలి, ఆగస్టు 24 : ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాటూరివారిపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు, కాటూరివారిపల్లి సమీపంలో రోడ్డుపై టిప్పర్ నిలిచిఉంది. ఒంగోలు నుండి పొదిలివైపు వెళ్తున్న ఓ ద్విచక్రవాహన చోదకుడు నిలిచి ఉన్న టిప్పర్‌ను వెనుకవైపు నుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపైన ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి గుంటూరు జిల్లా నిడుబ్రోలుకు చెందిన కాట్రగడ్డ కిషోర్‌కుమార్(64)గా స్థానికులు ఆధార్‌కార్డ్ ద్వారా గుర్తించారు. ప్రమాదస్థలాన్ని పొదిలి పోలీసులు పరిశీలించి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నవీన్‌కు కృష్ణకిశోర్‌రెడ్డి నివాళి


నివాళి అర్పిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 24 : మండలంలోని వెల్లుపల్లె గ్రామానికి చెందిన జి.నవీన్ (19) కంభం మండలం జంగంగుంట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా, శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణకిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి నవీన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గర్రె శ్రీనాథ్, దేశబోయిన వెంకటరాజు ఉన్నారు.

ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 24 : జిల్లాలోని రైతులకు అనేక సేవలు అందించిన ఏరువాక కేంద్రాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నర్సరావుపేటకు తరలించారని, అందువల్ల టీడీపీ కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని తిరిగి ఒంగోలుకు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతుసంఘాల ప్రతినిధి మండవ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి జిల్లాలో ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఒంగోలులోని వ్యవసాయమార్కెటింగ్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం రైతులకు విశేష సేవలను అందిస్తూ వచ్చిందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నర్సరావుపేటకు తరలించడం వల్ల రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నంద్యాలకు తరలించిన ఏరువాక కేంద్రాన్ని తిరిగి కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అక్కడి ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తేవడంతో ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కులపతి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అదే విధంగా ఒంగోలులో ఏరువాక కేంద్రం ఏర్పాటు చేసేలా జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం

● ఖజానాశాఖ ఉపసంచాలకులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 24: జిల్లాలో పెన్షనర్లకు ఏ సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరిస్తామని ఖజానా శాఖ ఉపసంచాలకులు జగన్నా థరావు హామీఇచ్చారు. పెన్షనర్లకు సంబంధించి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒంగోలులోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు, తాము ఉద్యోగ విరమణ చేసిన కార్యాలయం నుంచి కాకుండా తాము పెన్షన్ పొందుతున్న ఖజానా కార్యాలయం నుంచి పంపే ఏర్పాట్లు చేయాలని పెన్షనర్లు కోరారు. సమావేశంలో ఏటీవోలు కె.రాజ్‌కుమార్, ఎలీషారాణి, నివేదిత, శిరీష, నారాయణ, పెన్షనర్ల సంఘం నాయకులు ఆచారి, అంకిరెడ్డి, రాఘురామిరెడ్డి, రాఘవరావు, జీవీ.శేషయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఆవులకు గ్రాసం వితరణ


గడ్డిని తింటున్న ఆవులు

గిద్దలూరు, ఆగస్టు 24 : కబేళానికి తరలిస్తుండగా, పట్టుబడిన ఆవుల సంరక్షణ బాధ్యతను పలువురు దాతలు స్వీకరించారు. మార్కెట్‌యార్డులోని 75 ఆవుల సంరక్షణ కోసం 500 కట్టల పశుగ్రాసాన్ని నంద్యాల నుంచి శనివారం తెప్పించారు. ఆవులు నీరు తాగేందుకు తొట్లను ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులను పిలిపించి కొన్ని ఆవులకు చికిత్సలు చేయించారు. కార్యక్రమంలో దేవాలయాల సమన్వయ కమిటీ, ఆర్ఎస్ఎస్, సమరసత సేవా ఫౌండేషన్, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు బాధ్యతను తీసుకున్నారు. బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, కృష్ణారావు, యర్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


శ్మశానంలో మొక్కలు నాటుతున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 24 : పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శ్మశానం లోపల, బయట సుమారు 100 మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసేందుకు సంస్థ గౌరవాధ్యక్షులు గంజి వీరయ్య 10వేల విరాళాన్ని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి అది పెద్దదయ్యే వరకు సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామచంద్రుడు, కాశిరంగారెడ్డి, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత

మార్కాపురం, ఆగస్టు 24: స్థానిక తర్లుపాడు రోడ్డులోని జార్జి ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థులు చివరి సంవత్సరం 8వ సెమిస్టర్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.రాజాజయరావ్ తెలిపారు. చివరి సంవత్సరం వై-20 బ్యాచ్ విద్యార్థులు 92 మంది పరీక్షలు రాయగా 32 మంది డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారన్నారు. మిగిలిన 60 మంది ఫస్ట్‌క్లాస్‌లో పాసైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభచూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ విద్యార్థులను అభినందించారు. అంతేకాక విశ్వవిద్యాలయం పరిధిలో 20 ఫార్మసీ కళాశాలలు ఉండగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది జార్జి విద్యార్థులే అన్నారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వైసునీత, డాక్టర్ అశోక్, ముజీబ్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం


విద్యార్థులతో మట్లాడుతున్న బీజేపీ నాయకులు

తర్లుపాడు, ఆగస్టు 24: తర్లుపాడులోని ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. తర్లుపాడులోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యం కావాలి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, కనీస మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని, వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువజన కార్యదర్శి ఎమ్.ఓబుల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు జి.లక్ష్మీరెడ్డి, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని వనభోజనాలు

● సీతారాముల చిత్రపటంతో ప్రదర్శన


వనభోజనాలకు వెళుతున్న భక్తులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 24 : మండలంలోని నరసాయపాలెం గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామ ప్రజలు శనివారం వనభోజనాలు చేశారు. గ్రామంలోని ప్రజలు అందరూ ట్రాక్టరుపై సీతారామలక్ష్మణ చిత్రపటంతో గ్రామంలో ప్రదర్శన యాత్ర నిర్వహించారు. గ్రామం ప్రక్కనే ఉన్న చెరువు వద్ద వంటలు చేసుకొన్నారు. గ్రామ ప్రజలు సామూహిక వనభోజనాలు చేశారు. వనభోజనాలు పూర్తి అయ్యాక ప్రదర్శనగా సాయంత్రం ఇళ్లకు చేరుకున్నారు.

ఈ- పంట నమోదుకు అవకాశం


పసుపు పంటను పరిశీలిస్తున్న ఏవో

కంభం, ఆగస్టు 24 : కంభం మండలంలో రైతులు పసుపు, అరటి, పత్తి, మిరప, ఇతర కూరగాయలు సాగు చేస్తున్నారని ఏవో స్వరూప తెలిపారు. శనివారం ఆమె పట్టణంలోని చెరువు కింది పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా పంట నమోదులో పాల్గొన్నట్లు తెలిపారు. ఆమె రైతులతో మాట్లాడుతూ సెప్టెంబరు 15లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని, రైతులు సమీపంలోని రైతుసేవాకేంద్రం వారిని, గ్రామ రెవెన్యూ అధికారిని కలిసి పత్రాలను అందచేసి ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామరెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కంది, మినుము సాగు చేసుకోవాలి

పెద్ద దోర్నాల, ఆగస్టు 24:మండలంలోని రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో పత్తికి బదులుగా కంది, మినుము పైర్లు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సాగుచేసిన పత్తి, కంది మిరప పైర్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సాగు చేసిన ప్రతి పైరును సెప్టెంబరు 15వ తేదీ లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో దండోరా వేస్తారని రైతులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

దొనకొండ, ఆగస్టు 24: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దొనకొండ గ్రామ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న కుమారి, దేవానంద్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై శనివారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమ లుచేస్తూ ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల సీజన్‌లో భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం, ప్రకృతిని పరిరక్షిం చేందుకు మొక్కల పెంపకాన్ని అందరూ ప్రోత్సహించాలన్నారు. కుటుంబాల్లో జరుపుకునే ఎటువంటి వేడుకల్లో అయినా తీపి గుర్తుగా మొక్కలు నాటి మన కోసం, మన ఆరోగ్యం కోసం బాధ్యతగా పరిరక్షించాలని పిలు పునిచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, పత్తి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, ఫణిదపు వీరాంజనేయులు, దుగ్గెంపూడి చెన్నయ్య, పరుచూరి రామలింగయ్య, కుందుర్తి లక్ష్మణ్, షేక్ సుభాని, పోతిపోగు చెన్నయ్య, బొందల రాజు, జనసేన నాయకుడు గుంటు ఐజక్, తదితరులు పాల్గొన్నారు.

సీఐ నాయక్‌కు టీడీపీ నేతల శుభాకాంక్షలు



సీఐ భీమానాయక్‌ను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, ఆగస్టు 24: పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.భీమానాయక్‌ను శనివారం టీడీపీ శ్రేణులు స్థానిక సర్కిల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐని కలిసినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు, పందిటి హరీష్, వార్డు మెంబర్లు షేక్ నాయబ్‌రసూల్, పిడుగు శ్రీనివాసులు, బత్తుల సత్యనారాయణ, ముబీనా మౌలాలి, కొండా నరసింహులు, దోరశల కోటిరెడ్డి, ఎస్.శ్రీనివాసులు వాయినేని రాఘవ, బండ్ల నారాయణ, తదితరులు ఉన్నారు.

పామూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రం



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

పామూరు, ఆగస్టు 24: పామూరు పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. పెరుగుతున్న వాహనాలకు అణుగుణంగా విశాలంగా ఉండాల్సిన రోడ్లు దుకాణదారుల ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లపైకి ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ నిలిచిపోతున్నది. శనివారం సీఎస్‌పురం నుంచి రోగులను పామూరు ఆస్పత్రికి తీసుకువస్తున్న 108 అంబులెన్స్ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకొన్నది. సైరెన్ మోగుతున్నా అంబులెన్స్‌కు దారి దొరకకపోవడంతో ట్రాఫిక్‌లో నిలబడిపోయింది. ఇప్పటికైనా గ్రామ పంచాయతి, పోలీస్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

కనిగిరి ఆగస్టు 24: మహిళలకు భద్రత పెంచాలని యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మాలకొండారెడ్డి, రమణారెడ్డి, రహంతుల్లా, రాము, నరసింహా, మల్లికార్జున, కల్పన, స్వప్న, ఉమామహేశ్వరి, ఎంహెచ్‌ఆర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ శింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న పాములకాలనీ వాసులు

తాళ్లూరు, 24: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన నల్లూరి ఏసోబు కుటుంబం తమ ప్రాంతంలో కొంత స్థలాన్ని ఆక్ర మించి దౌర్జన్యంగా కట్టడాలు చేపడుతున్నారని అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని పాములకాలనీవాసులు శనివారం తహసీల్దార్ పి.శింగారావు వద్ద వాపోయారు. దాదాపు 20 కుటుంబాలవారు తహసీల్దా ర్ కార్యాలయానికి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము నివాసముంటున్న స్థలంలో కొంతభాగాన్ని ఎ స్సీ కాలనీకి చెందిన నల్లూరి ఏసోబు కుటుంబీకులు ఆక్రమిస్తుండగా మూడునెలల క్రితం తహసీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులు ఆస్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమని బోర్డు ఏర్పాటుచేశారని తెలిపారు. ఆక్రమణదారుడు లెక్కచేయకుండా బోర్డు పీకేసి తన ఇష్టాను సారం కట్టడాలు చేపడుతున్నారన్నారు. త మ పూర్వీకులు నివాసముంటున్న స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమిస్తున్న వ్యక్తికి ఎస్సీ కా లనీలో మూడు నివాస గృహాలున్నాయన్నారు.

శుక్రవారం ఆక్రమణదారుడు ఆస్థలంలో బోరు వేయించబోగా తాము ఏఎస్‌ఐ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు వచ్చి బోరు వేయకుండా నిలిపివేశారన్నారు. తమకు న్యాయంజరిగేలా చూడాలని కోరుతూ తహసీల్దార్ శింగారావుకు పాముల కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. తాను స్వయంగా ఆ స్థలాన్ని పరిశీలించి పేదవర్గాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రమీల, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌లో పోలీసుల తనిఖీలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 24: ఒంగోలు నగరంలోని ఓ స్పా సెంటర్‌లో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గతంలోనూ ఇదేవిధంగా ఆకస్మిక దాడులు నిర్వహించగా సదరు స్పాసెంటర్‌లలో మహిళలు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న మహిళలను హోంకు పంపించి, స్పాసెంటర్ యజమానితోపాటుగా అక్కడకు వెళ్ళిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో పోలీసులు మరోమారు తనిఖీలు చేయగా అక్కడ మహిళలు లేరు. దీంతో స్పాసెంటర్ యజమానులకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తాలుకా ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్‌తో నాణ్యమైన విద్యుత్

» మంత్రి గొట్టిపాటి రవికుమార్

» మారెళ్లలో ప్రాజెక్టు ప్రారంభం

ముండ్లమూరు, ఆగస్టు 24: సోలార్‌తో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. వాతావరణంలో కూడా కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెం వద్ద 14 ఎకరాల్లో రూ.15 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగా హైడ్రోజన్, విండ్ పీఎస్పీ మరికొన్ని పద్ధతుల్లో ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుకు పనికిరాని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అందుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిందని మంత్రి రవికుమార్ ధ్వజమెత్తారు. సోలార్ ద్వారా ఒక్క యూనిట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. జల, థర్మల్ విద్యుత్తులు అధిక వ్యయంతో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ప్రక్క రాష్ట్రాల కంటే తమ బినామీ సంస్థల ద్వారా విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 56 రోజుల్లోనే 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిందన్నారు. అందులోభాగంగా ఇప్పటికే స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. విద్యుత్ వైరు కొరతతో కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లోనే కండక్టర్లు వచ్చిన వెంటనే కనెక్షన్లు అందజేస్తామన్నారు.

ఇటీవల కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలు అధికమయ్యాయని మంత్రి రవికుమార్ పేర్కొన్నారు.



మారెళ్లలో సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

కాపర్ బదులు అల్యూమినియం వాడితే దొంగతనాలు నివారించవచ్చని చెప్పారు. దొంగలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని కొనే షాపుల యజమానులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతమైన మారెళ్లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసిన సినీ నిర్మాత అశోక్‌బాబును గొట్టిపాటి రవికుమార్ అభినందించారు.

కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, డాక్టర్ లలిత్‌సాగర్, ప్లాంట్ నిర్వాహకులు అశోక్‌కుమార్, ఎస్ఈ సత్యనారాయణ, సీఈవో ఉన్నం నవీన్, సీవోవో ఆర్తీక, బాతు కరీమ్, ఏడీ పిచ్చయ్య తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరా వు, సుంకర రాఘవరెడ్డి, మేదరమెట్ల వెంకటరావు, మట్టా సుబ్బారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గల్లంతుతో..
మూడు గ్రామాల్లో విషాదం

» బాధిత కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, ఆగస్టు 24: సాగర్ కాలువలో ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు గల్లంతు కావటంతో మూడు గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. మండలంలోని కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన పోలిరెడ్డి లోకేష్‌రెడ్డి, కుందుర్రు కిరణ్‌కుమార్‌రెడ్డి, బత్తుల మణికంఠారెడ్డిలు పదో తరగతి నుంచి మంచి స్నేహితులు. వారి తల్లిదండ్రులు సామాన్యరైతు కుటుంబీకులు. వ్యవసాయంపై జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. కొత్తపల్లికి చెందిన దానియేల్ రెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో లోకేష్ రెడ్డి, సోదరి దర్శిలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్నారు. లక్ష్మీనారాయణపురంకు చెందిన కుందుర్రు వెకంట నారాయణ, లక్ష్మమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిలో కిరణకుమార్‌రెడ్డి స్థానిక ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కొర్లమడుగుకు చెందిన జయరామిరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో మణికంఠారెడ్డి నూజివీడులో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. తమలా పిల్లలు కష్టపడకూడదన్న ఉద్దేశ్యంతో సన్నకారు రైతులైనప్పటికి పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎంతో ఆశపడిన వారి ఆశలు అడియాశలయ్యాయి. చేతికి అందివచ్చిన సమయంలో అకాల మృత్యువు కబలించటంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మూడు గ్రామాల్లోని ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోకేష్‌రెడ్డి మృతదేహం లభించింది. మిగిలిన ఇద్దరి మృతదేహాల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురి దుస్తులు, చెప్పులు, మోటార్ సైకిల్ ఒకేచోట ఉండటంతో ముగ్గురు కాల్వలో ము నిగి గల్లంతయినట్లు నిర్ధారించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సాగర్ కాలువలో గల్లంతయిన విద్యార్థుల కుటుంబాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరామర్శించి ఓదార్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసి మిగిలిన ఇద్దరి ఆచూకీ కనుగొనాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళి సిబ్బందితో, గజఈతగాళ్లతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించొద్దు!

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి ఆగస్టు 24: స్వప్రయోజనాల కోసం అభివృద్ధి పనులకు ఆటంకం కల్గించటం సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని చింతలపాలెం వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ ప్రదేశంలో నుంచి నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ మార్గం వెళ్తుంది. దీంతో క్వారీ యజమాని రైల్వే లైన్ ఏర్పాటుతో తన క్వారీ నుంచి డంపింగ్ తీసుకెళ్లేందుకు ఎక్కువ దూరం వెళ్లి డంపింగ్ చేసుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైల్వే పనులను అడ్డుకుంటూ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆప్రాంతం వరకు వచ్చిన రైల్వే పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

విషయం తెలుసకున్న ఎమ్మెల్యే రెవెన్యూ, మైనింగ్ అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఆర్డీవో జాన్‌ఇర్విన్ నుంచి ఆప్రాంతం లోని ఫీల్డ్‌మ్యాప్‌ను పరిశీలించారు. క్వారీ నిర్వాహకులకు దగ్గర దూరం ఉండేవిధంగా ప్రభుత్వభూమిలో నుంచి కొంత దారి ఏర్పాటుచేసి ఇచ్చేందుకు ఒప్పించారు. రైల్వే, మైనింగ్ అధికారులతోనూ మాట్లాడారు. బాధిత క్వారీ యజమాని సముఖం వ్యక్తం చేసి కోర్టులో ఉన్న పిటిషన్ ఉపసంహరించుకుంటామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో సమస్య పరిష్కారం కావటంతో అధికారులు, క్వారీ యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ రెడ్డి, సర్వేయర్ ప్రియాంక, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



క్వారీ యజమానులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, ఆగస్టు 24: మండలంలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ జి.సుధారాణి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారుల కు సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అధికారు లు నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. గ్రామసభల్లో ప్రతిపాదిం చిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను మండల పరిషత్ ఆమోదం లేకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. అందుకు ఎంపీడీవో కుసుమకుమారి సమా దానమిస్తూ పనుల నిర్వాహణకు మండల పరిషత్ తీర్మానం తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే 15 రోజుల్లోపు తీర్మానం ఇవ్వకపోతే జిల్లా అధికారుల అనుమతితో గ్రామసభల ఆమోదంతో పనులు ప్రారంభించే వెసులుబాటు ఉందన్నారు. ఈసందర్భంగా కట్టసింగన్నపాలెం పాఠశాలలో బోరు వేయాలని ప్రతిపాదించగా, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి ఆమోదించకపోవటంతో సభ్యులు కూడా తిరస్కరించారు. ఈవిషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా సభ్యుల ఆమోదించకపోవటంతో పాఠశాలలో బోరు వేయటం సాధ్యంకాదని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల అవసరానికి ప్రతిపాదించిన బోరు వేయకుండా అడ్డుకోవటం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కనిగిరి ఆగస్టు 24: కనిగిరిలోని వివిధ పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని కేటీఆర్ టెక్నో స్కూల్‌లో చిన్నారులు కృష్ణుని వేషధారణతో వేసిన నృత్యాలు అలరించాయి. ఐకిడ్స్ స్కూల్‌లో శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రార్థించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షరీఫ్, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కరరావు, బి.నరేంద్ర, షేక్ షియాజ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలోని ఐకిడ్స్ స్కూల్‌లో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



పామూరు: గోపికల వేషధారణలో సెయింట్ మార్క్ విద్యార్థులు

పామూరులో.. పామూరు, ఆగస్టు 24: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురష్కరిం చుకొని పామూరు సెయింట్ మార్క్ స్కూల్‌లో శనివారం ముందస్తుగా శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చిన్ని కృష్ణులుగా, బాలికలు గోపికల వేషాధారణతో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైన లక్ష్యం సాధించ డంలో వెనుకపడవద్దని సందేశమిచ్చారు. అలాగే, స్థానిక ఆల్ఫా లిటిల్ కింగ్‌డమ్ స్కూల్ విద్యార్థులు ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

పామూరు, ఆగస్టు 24: డివైడర్‌ను కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం తెల్లవారు జామున పామూరులో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. విను కొండ నుంచి కడపకు వెళుతున్న కారు పామూరు వద్ద రాంగ్ రూట్‌లో రోడ్డుబ్రిడ్జి డివైడర్‌ను నిద్రమత్తులో ఢీకొంది. ఈప్రమాదంలో కారులోని హెయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. కారు ముందుభాగం దెబ్బతింది. కారు నడుపుతున్న కానిస్టేబుల్ చేతికి గాయంకాగా, అందులో ప్రయాణిస్తున్న మరొకరికి నడుము, రెండు కాళ్లకు తీవ్రమైన గాయాలు కావడంతో వైద్యం కోసం తిరు పతికి తరలించారు.

త్వరలో సాగర్ జలాలు విడుదల

ముండ్లమూరు, ఆగస్టు 24: త్వరలో సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శనివారం మండలంలోని గంగన్నపాలెంకు వచ్చిన ఆయనను వివిధగ్రామాల రైతులు కలిశారు. తాము సాగు చేసిన మొక్కజొన్న, సజ్జ, వరి నారుమళ్లు ఎండుముఖం పట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా వ్యయప్రయాసలకోర్చి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని పంటలను కాపాడుకుంటున్నామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని అండగా ఉంటామని చెప్పారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని కుడి ఎడమ కాలు వల పరిధిలోని ఒక ఎకరా పంట కూడా ఎండకుండా చూస్తామని చెప్పారు. త్వరలో సాగర్ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటితో నోటిఫైడ్ నాన్ నోటిఫైడ్ చెరువులను నింపనున్నట్లు చెప్పారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలతో డ్యాములు నిండుకుండలా ఉన్నాయని, పంటలకు నీరందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

పామూరు, ఆగస్టు 24: మండలంలోని తిరగళదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో స్వామివార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ, స్వామివార్ల శాంతి కల్యాణం, కుంభాభిషేకాలు, అన్నదాన కార్యక్రమా లు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీలు బొల్లా నరసింహారావు, బొట్ల నాగార్జున, జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు, మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావు యా దవ్, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, యేల్చూరి బాల కొండలరావు, గుత్తి వెంకటరాజు, కాకొళ్ల వెంకటరత్నం, ఇర్రి కోటిరెడ్డి, పిడుగు శ్రీనువాసులు, ఆవుల రమణమ్మ పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్ల

పామూరు, ఆగస్టు 24: పామూరులోని తూర్పువీధిలో వెలసియున్న గ్రామ దేవత శ్రీపోలేరమ్మ తల్లి తిరునాళ్ల పొంగళ్ల కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా పోలేరమ్మ అనుగ్రహం కోసం శాంతి పూజలు, బండ్లు పొంగళ్ల నిర్వహిస్తారని తెలిపారు.





వడ్లమూడి సమీపంలోని డీవీసీ ఆస్పత్రి ఐసీయూలోని వసతులను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు, ఇతర డాక్టర్లు, సిబ్బంది - పొన్నూరు

విద్యాలయంలో.. విషవాయువులు

- సైన్స్ ప్రయోగంలో అపశృతి.. విద్యార్థులకు అస్వస్థత
- సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో ఘటన.. సీఎం పేషీ ఆరా
- సత్వరం స్పందించిన అధికారులు.. నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి



బాపట్ల ఏరియావైద్యశాలలో చికిత్స పొందుతున్న సూర్యలంక కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న జాయింట్ కలెక్టర్.బిసుబ్బారావు



ఆసుపత్రిలో కోలాహలంగా ఉన్న పేరెంట్స్



విషవాయువులు వెలువడటానికి కారణమైన రసాయనాలతో ఉన్న పేపర్‌ను భద్రపరిచి ల్యాబ్ పంపేందుకు సిద్ధం చేసిన వైద్యులు

బాపట్ల, ఆగస్టు 24: సైన్సు ప్రయోగం.. కొందరు విద్యార్థుల ఆకతాయితనం.. విషవాయువులు వెలువడి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన బాపట్ల మండలం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం చోటుచేసుకుంది. విద్యాలయంలో ఉదయం ఆరో తరగతి విద్యార్థులకు సైన్స్ క్లాస్‌లో భాగంగా రసాయన ప్రయోగాలను ప్రాక్టికల్స్ ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయురాలు వివరించారు. టీచర్ బయటకు వెళ్లగా అక్కడ ఉన్న రసాయనాలకు ఓ విద్యార్థి తన దగ్గర ఉన్న ఉప్పు, శానిటైజర్‌కు తోడు కాఫీపొడి మిక్స్ చేశాడు. దీంతో ఒక్కసారిగా విషవాయువులు తరగతి గది అంతా పొగలా వ్యాపించాయి. ఇవి పక్క గదిలోని ఏడో తరగతి విద్యార్థులను కూడా తాకడంతో అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులు టిష్యూ పేపర్‌పై ఆ రసాయనాన్ని వేసి వాసన చూడడంతో మరింత అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు విద్యార్థులు గదిలోనే స్పృహ తప్పి పడిపోగా, మిగిలిన వారు ఊపిరి అందక ఇబ్బంది పడ్డారు. పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు సూర్యలంకలోని ఆస్పత్రికి 25 మందిని తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాపట్లలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో వైద్యబృందం తక్షణమే స్పందించి విద్యార్థులకు చికిత్స అందించడంతో మూడు గంటలు తర్వాత కోలుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో కుటుంబ సభ్యులు వచ్చి పిల్లలను తీసుకెళ్ళారు. విద్యార్థులలో మధురియా అనే బాలిక జ్వరంతో బాధపడుతూనే స్కూల్‌కు వెళ్ళి విషవాయువుల బారినపడటంతో చికిత్స పొందుతోంది. షణ్ముఖ అనే మరో విద్యార్థికి ఈసీజీ తీయగా ఇతర సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

విద్యార్థులను పరామర్శించిన జేసీ

సంఘటన గురించి తెలుసు కున్న వెంటనే జేసీ బి.సుబ్బారావు ఏరియావైద్యశాలకు వచ్చి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరో గ్య పరిస్థితిపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఏమిలేదని అందరు ఆరోగ్యంగా ఉన్నట్లు జేసీ విలేకర్లకు తెలిపారు. విద్యాలయంలో విషవాయువులు వెలువడటానికి కారణమైన టి ష్యూ పేపర్లలోని రసాయనాలను సేకరించి ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు పంపించి పరీక్షిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. 25 మం ది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. ఈ సంఘటనపై సీఎం పేషీ జిల్లా అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అన్ని రకాల చర్యలు తీసుకుని విద్యార్థులకు చికిత్సలు అందించాలని అధికారులను సీఎం కార్యాలయం ఆదేశించింది.

వైద్యాధికారులపై జడ్జి వాణి ఆగ్రహం

విషవాయువులతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి ఏరియావైద్యశాలను సందర్శించారు. ఆసమయంలో వైద్యులు సరైన సమాచారం ఇవ్వకపోవడం, కొంత మంది వైద్యుల నిర్లక్ష్యంపై ఓ మహిళ ఫిర్యాదుతో జడ్జి వాణి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్‌ను పిలిపించి ఉదయం డ్యూటీచార్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని మిస్ గైడ్ చేయరాదని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.



బాపట్ల ఏరియా వైద్యశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

అక్రమ లేఅవుట్లు.. 274

- వాటి వద్ద బోర్డుల ఏర్పాటుకు సిద్ధం
- ప్రజల్లో అవగాహనకు అధికారుల చర్యలు
- కూటమి ప్రభుత్వం రాకతో అక్రమాలపై దృష్టి
- వైసీపీ పాలనలో ఇబ్బడిముబ్బడిగా అనధికార లేఅవుట్లు
- వాటిని కొనుగోలు చేసిన మధ్యతరగతి వర్గాలు విలవిల



బాపట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ లే అవుట్ల విషయంలో అక్రమార్కులు పోటీ పడ్డారు. వైసీపీ నేతలకు, వారి తొత్తులుగా వ్యవహరించిన అధికార గణానికి ముడుపులిచ్చి ఎటువంటి నిబంధనలు పాటించకుండా లే అవుట్లు వేసి సొంతింటి కలసాకారం కోసం పైసాపైసా కూడబెట్టుకుని ప్లాట్లు కొనుక్కున్న జనాన్ని నిలువునా వంచించారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న అక్రమ లే అవుట్ల వివరాలను యంత్రాంగం సేకరించింది. వాటి వివరాలతో ఇప్పటికే ప్రకటనలు ఇవ్వడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 104, రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో 40, అద్దంకి, కొరిశపాడు, చీరాల, పర్చూరు, మార్టూరు, వేటపాలెంలో భాగమై ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 91 అనధికార లే అవుట్లను అధికారులు గుర్తించి బహిరంగపరిచారు. నిబంధనలకు విరుద్ధంగా గుర్తించిన లే అవుట్లలో దాదాపు 50 శాతం ఐదేళ్ల వైసీపీ పాలనలో వేసినవే కావడం గమనార్హం. వీటిలో మొత్తం ప్లాట్లు విక్రయించి నిర్మాణాలు కూడా జరిగినవి 30 శాతం వరకు ఉంటే మొత్తం అమ్మకాలు జరిగిన లే అవుట్లు మరో 50 శాతం వరకు ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలోనే కొంతమంది అధికారులు ఈ అనధికార లేఅవుట్ల వద్దకు వెళ్లి బోర్డులు పెడితే వాటిని దౌర్జన్యంగా తొలగించడంతో పాటు వారి మీద దాడికి కూడా ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయి. అన్ని అనుమతులు ఉన్నాయని ప్రజలను మభ్యపెట్టి ప్లాట్లు అమ్ముకుని రియల్టర్లు రూ.కోట్లు దండుకున్నారు. కొనే ముందు వివరాల కోసం కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులను సైతం అప్పుడు పనిచేసిన అధికారులు తప్పుదోవ పట్టించారనే విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి

ఐదేళ్లు ఏం చేశారో..

ఇంత పెద్ద సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి సామాన్యులను మోసం చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఐదేళ్ల పాటు ఎందుకు చేష్టలుడిగి ఉండిపోయారో అనేదానికి సమాధానం చెప్పాల్సి ఉంది. అడ్డగోలుగా లేఅవుట్లు వేసి బిల్డింగ్ నిర్మాణాలు చేపడుతుంటే ఏదశలోనూ వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కంటితుడుపు చర్యగా ఒకట్రెండుసార్లు నోటీసులు ఇచ్చి మమ అనిపించారే తప్పితే కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడం వల్లే ప్లాట్లు కొన్న వేల సంఖ్యలో ప్రజలు ఈ రోజు అగచాట్లు పడే పరిస్థితి తలెత్తింది. నిబంధనల ప్రకారం లేఅవుట్‌కు అన్ని అనుమతులు ఉంటేనే విక్రయాలు జరపాలి. లేకపోతే రిజిస్ట్రేషన్ విభాగానికి సమాధానం ఇవ్వాలి. తదుపరి సదరు యజమానికి నోటీసులు జారీ చేయాలి. అప్పటికీ స్పందించకపోతే దానిని పూర్తిగా రద్దు చేసి బహిరంగ ప్రకటన ఇవ్వాలి. అధికారం అండతో వైసీపీ నేతలు ఏకంగా యంత్రాంగం విధులకే ఆటంకం కల్పించిన వారిపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు? వీటన్నింటికి గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

అక్రమార్కులకు సొమ్ములు.. కొనుగోలుదారులపై భారం

అక్రమ లే అవుట్ల విషయంలో వాటి యజమానులు భారీగానే సొమ్ము చేసుకున్నారు. వారికి వంతపాడిన అధికారగణం వేరే చోటకు బదిలీపై వెళ్లిపోయారు. ఇప్పుడు చిక్కల్లా వాటిని కొన్న జనానికే అన్నట్లు పరిస్థితి తయారైంది. అక్రమ లే అవుట్ల విషయంలో కూటమి ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దానిలో



బాపట్ల పరిధిలోని పాండురంగాపురం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్

భాగంగానే చర్యలు తీసుకుంటుంది. రేపోమాపో ఈ అక్రమ లే అవుట్లపై ఒక పాలసీని తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. ఎల్ఆర్ఎస్ కింద నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించి వాటిని అనధికార జాబితా నుంచి తప్పించే వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది. అలాంటప్పుడు ఇప్పటికే వందశాతం ప్లాట్లు అమ్ముకున్న యజమానులు ఈ శ్రీముఖాలపై స్పందించే అవకాశాలు తక్కువే. అప్పుడు ఈ భారం కూడా ప్లాట్ కొనుక్కున్న వినియోగదారుడిపైనే పడే అవకాశం ఉంది. అక్రమ లే అవుట్లపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇదే సమయంలో పాలకులు తీసుకునే తదుపరి చర్యలు అటు యజమానులను, ఇటు వారికి సహకరించిన అధికారులపై ఉండాలే తప్పితే జరిమానాల భారం ప్లాట్లు కొనుక్కున్న ప్రజలపై పడకుండా చూడాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైసీపీ నేతల అండతో చెలరేగిపోయిన లే అవుట్ల యజమానులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు వారికి సహకరించి వేర్వేరు చోట్ల ఉన్న అధికారులపైన విచారణకు ఆదేశించి కఠినంగా శిక్షించాలనే డిమాండ్లు బాధితుల నుంచి వస్తోంది.

జాగ్రత్త పడకుంటే ఇబ్బందులే..

అక్రమ లే అవుట్లతో అధికారుల జేబులూ నిండాయి. వాటి ద్వారా కోట్లు గడించిన యజమానులు, వైసీపీ నేతలు బాగానే ఉన్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన అక్రమ లే అవుట్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన యంత్రాంగం బాగానే ఉంది. కానీ ఇప్పుడు వాటిని కొన్న మధ్య తరగతి ప్రజల్లో మాత్రం ఆందోళన నెలకొంది. వైసీపీ ఐదేళ్లలో చేసిన అక్రమాల మీద కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు అర్బన్ అథారిటీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్ల జాబితాను ఇప్పటికే అధికారులు బహిరంగపరిచారు. ఆ లే అవుట్లలో ఎటువంటి క్రయవిక్రయాలు జరపకూడదనే బోర్డులు కూడా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ ఆదేశాలతో సిద్ధమయ్యారు. రేపోమాపో వాటి మీద జరిమానాల పిడుగు ఎల్ఆర్ఎస్ కింద విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మీదట ప్లాట్లు కొనేవాళ్లు లే అవుట్ల విషయంలో జాగ్రత్త వహిస్తే తర్వాత బాధలు తప్పుతాయి. ఇక మీదట లే అవుట్ల విషయంలో పారదర్శకత పాటించే విధంగా అధికారులకు ఆదేశాలివ్వడంతో పాటు వాటికి సంబంధించిన అనుమతులను పబ్లిక్ డొమైన్‌లో పెడితే ప్రజలు ఈ మోసగాళ్ల బారిన పడకుండా ఉంటారు. ఇదే సమయంలో ప్లాట్లు కొనుక్కునే ప్రజలు సైతం ఒకటికి రెండుసార్లు అనుమతుల విషయంలో విచారణ చేసుకున్న తర్వాతనే ప్లాట్ల కొనుగోలు చేయాలి లేకపోతే ఇలాంటి ఇబ్బందులు తప్పవు.

అమరావతి.. ఆహ్లాదం

- పర్యాటక రాజధానిగా అభివృద్ధికి చర్యలు
- ఏడీసీ ఆధ్వర్యంలో బ్లూ-గ్రీన్ ప్రాజెక్టుల నిర్మాణం
- శాఖమూరు, వెంకటపాలెం పర్యటనలో మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 24: ప్రజా రాజధాని అమరావతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ - గ్రీన్ కాన్సెప్ట్‌తో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారధితో కలసి వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్క్‌లను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శాఖమూరు సెంట్రల్ పార్కులో జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో అందమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చి దిద్దుతామన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారి లక్ష్మీపార్థసారధికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రభుత్వం అప్పగించిందన్నారు. 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండవీటి వాగు పాలవాగు, గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 23-30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, మల్కాపురంలో 21 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేసి వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ పెంచతామన్నారు.



శాఖమూరు సెంట్రల్ పార్కులో యంత్రంతో గడ్డి కట్ చేస్తున్న మంత్రి నారాయణ

పోస్టింగ్‌లకు.. పోటీ

- బదిలీల కోసం భారీగా సిఫార్సులు
- ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు..
- ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలని హెచ్‌వోడీల ఆరా
- బదిలీ కోరుతూ 70 నుంచి 90 శాతం దరఖాస్తులు

బదిలీల నిషేధ గడువు సమీపిస్తోంది. బదిలీలకు సమయం దగ్గరకు వచ్చేసింది. అనుకూలమైన పోస్టింగ్ కోసం ఉద్యోగుల నుంచి అధికారుల వరకు పోటీపడుతున్నారు. ఎవరిస్థాయిలో వారు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఒక్కో పోస్టు కోసం రెండు నుంచి ఐదు వరకు సిఫార్సులు వచ్చాయి. ఇవే కాకుండా ఇంకా కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే అంశంలో ఉన్నతాధికారుల్లో గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. వైసీపీతో అంటకాగిన వారు కూడా సిఫార్సులతో సిద్ధమైనట్లు సమాచారం. దాదాపు బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతాధికారులకు, మంత్రుల పేషీలకు చేరగా వీటిపై కసరత్తు ప్రారంభమైనట్లు సమాచారం. బదిలీలపై ఉద్యోగుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎవరి సిఫార్సు లేఖలు పనిచేస్తాయో.. ఎవరివి బుట్టదాఖలు అవుతాయో ఈ నెల 31వ తేదీతో తేలుతుంది.


- ఓ మున్సిపాల్టీలో డీఈ పోస్టు కోసం ఐదుగురు లేఖలతో సిద్ధమయ్యారు. ఈ ఐదుగురులో ఎవరికి పోస్టింగ్ ఇవ్వా లో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏ నేత సిఫార్సుకు ఆమోదం తెలిపితే ఏమవుతుందోననే ఆందోళనలో హెచ్‌వోడీలు ఉన్నాయి.
- మరికొన్ని నియోజకవర్గాల్లో కొన్ని పోస్టులకు రెండు నుంచి మూడు లేఖలు జారీ అయ్యాయి. ఓ నియోజకవర్గంలో సిఫార్సు లేఖల జారీ గందరగోళానికి దారి తీసినట్టు తెలిసింది.
- ఓ అధికారి పోస్టింగ్ విషయంలో పార్టీ నేతలు వివాదానికి కూడా దిగినట్లు సమా చారం. వైసీపీతో అంటకాగిన అధికారికి సిఫార్సు లేఖ జారీ చేయడం వల్లే ఈ వివాదం జరిగినట్టు తెలిసింది.
- కొన్నిచోట్ల ద్వితీయశ్రేణి నేతలు బేరసారాలు చేసుకుని ఎమ్మెల్యేలను మభ్యపెట్టి సిఫార్సు లేఖలు జారీ చేయించినట్లు సమాచారం. ఈ కారణంగానే ఒక్కో పోస్టుకు ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ అయినట్లు సమాచారం.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీలపై నిషేధం సడలించిన తర్వాత జరుగుతున్న ప్రహసనం. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన రెండునెలల తర్వాత బదిలీలకు ఆమోదం తెలపగా ఈ నెల 31వ తేదీని గడువుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రిక్వెస్ట్ విధానంలో బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చినచోట పోస్టింగ్‌కోసం పైరవీలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే సిఫార్సులేఖ తప్పనిసరి చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున సిఫార్సు లేఖలు తెచ్చుకుని బదిలీ దరఖాస్తుతో ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేసినట్లు సమాచారం. ఇలా దరఖాస్తు చేసిన ఉద్యోగులకు సంబంధించి ఈ నెల 31న బదిలీల జాబితా విడుదల అవుతుందని అధికారులు తెలిపారు. 70నుంచి 90 శాతం వరకు బదిలీలు కోరుతూ లేఖలను ఆయా శాఖల హెచ్‌వోడీలకు పంపారు. రెండు రోజుల్లో లేఖల ప్రక్రియ ముగుస్తుందంటున్నారు. బదిలీలకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో లెక్కకు మించి సిఫార్సులేఖలు జారీ అయ్యాయి. ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు కూడా సిఫార్సు లేఖలు రావడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఒక పోస్టుకు ఒకటికి మించి సిఫార్సు లేఖలు అందడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియని పరిస్థితి ఆయా శాఖ హెచ్‌వోడీల్లో నెలకొన్నట్లు చెబుతున్నారు. బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతాధికారులకు, మంత్రుల పేషీలకు చేరాయి. వీటిపై కసరత్తు ప్రారంభమైంది. కొన్నిచోట్ల ఒక పోస్టుకు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ కావడంతో పోస్టింగ్‌ల విషయంలో ఉన్నతాధికారులు కొంత మేర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రచారం. సిఫార్సు లేఖలు ఇప్పించడంతో పోటీ పడిన ద్వితీయ శ్రేణి నేతలు వారు రికమండ్ చేసిన వారికి పోస్టింగ్‌లు దక్కుతాయా లేదా అన్న సంశయంలో ఉన్నారు.

ఇంకా పైరవీ ప్రయత్నాల్లో పలువురు

ఇప్పటికే ఒక్కో పోస్టుకు పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడం. ఎవరికి, ఏ లేఖకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ క్రమంలో ఇంకా కొందరు పోస్టింగ్‌ల కోసం పైరవీల్లో ఉన్నారు. ద్వితీయ శ్రేణి నేతలను ఆశ్రయించి వారి ద్వారా పోస్టిం గ్‌ల కోసం పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే ఒకే పోస్టింగ్‌కు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సులేఖలు జారీతో లేఖలు ఇప్పించిన నేతలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ శాఖలో డిప్యూటేషన్‌పై ఇతర శాఖల అధికారులు పనిచేస్తున్నారు. వీరికి తిరిగి పోస్టింగ్‌ల కోసం కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. విద్యా, ఆడిట్ వంటి శాఖల్లో పనిచేసిన వారిని మున్సిపల్ అధికారులుగా తీసుకురావడానికి యత్నిస్తున్నారు. అయితే డిప్యూటేషన్లను ప్రభుత్వం అంగీకరించడంలేదని చెబుతున్నారు.



వైసీపీ అధికారులకూ సిఫార్సులు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ నేతలతో అంటకాగిన అధికారుల్లో కొందరికి కోరుకున్నచోట పోస్టింగ్‌లు దక్కేవిధంగా కూటమి నేతల ద్వారా సిఫార్సులేఖలు జారీ అయ్యాయన్న విమర్శలున్నాయి. వైసీపీ నేతలకు సహాయ సహకారాలు అందించి, అక్రమాలకు ఊతం ఇచ్చిన కొందరు అధికారులు బడా కాంట్రాక్టర్ల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీనిని టీడీపీ నేతలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.

వేమవరంలో.. రీజెన్సీ సిరామిక్

- యానాం నుంచి తరలివచ్చిన పరిశ్రమ
- సీఎం చంద్రబాబుతో ప్రారంభించేందుకు సన్నాహాలు

బల్లికురవ, ఆగస్టు 24: బల్లికురవ మండలంలో పారిశ్రామికవాడగా పేరొందిన వేమవరం గ్రామానికి పుదుచ్చేరి రాష్ట్రం యానాం నుంచి రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తరలిరానుంది. అక్కడి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. చంద్రబాబు ప్రభుత్వం పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రీజెన్సీ చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు ముందుకొచ్చారు. కొంత కాలంగా పనులు నిలిచిపోయిన సెగ్నో సిరామిక్ ఫ్యాక్టరీలో సంస్థ కార్యకలపాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో రీజెన్సీ పరిశ్రమను ప్రారంభించేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేపడుతున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పారిశ్రామికవాడ అభివృద్ధివైపు పరుగుపెడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వేమవరం గ్రామ పరిధిలో సుమారు 25 ఎకరాల్లో సెగ్నో సిరామిక్ టైల్స్ ఫ్యాక్టరీ దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. అయితే కొంతకాలం నుంచి ఈ పరిశ్రమలో పనులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో యానాంలో కొన్నేళ్లగా మూత పడి ఉన్న రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తిరిగి తమ వ్యాపారాన్ని ఇక్కడ ప్రారంభించేందుకు సిద్ధమైంది. శనివారం సిరామిక్ ఫ్యాక్టరీలో పూజ కార్యక్రమాలను నిర్వాహకులు ప్రారంభించారు. పరిశ్రమ ఏర్పాటైతే యువతకు ఉపాధితోపాటు నాణ్యమైన టైల్స్ ఇక్కడే అందుబాటులో ఉంటాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి వైపు వేమవరం

వేమవరం అంటే గుర్తుకొచ్చేది గ్రానైట్ ఫ్యాక్టరీలే. ఇక్కడ సుమారు 125 గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు రన్నింగ్‌లో ఉన్నాయి. పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఉపాధిని పొందుతున్నారు. ఇప్పుడు రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తరలి రానుండడంతో వేమవరం పారిశ్రామికవాడ అభివృద్ధి వైపు పరుగులు పెట్టనుంది.



పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న నిర్వాహకులు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన రీజెన్సీ పరిశ్రమ



విద్యుత్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

చినగంజాం, ఆగస్టు 24 : ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో జరుగుతున్న విద్యుత్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో 100 కేవీ విద్యుత్ టాన్స్‌ఫారం దిమ్మ దెబ్బతిందని, ఆప్రాంతంలోని విద్యుత్ లైన్లు కిందికి వేలాడుతున్నాయని ఇటీవల సోపిరాల గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరికి సమస్యను వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ శాఖాధికారులు రూ.3లక్షల నిధులతో శనివారం పనులను ప్రారంభించారు. ట్రాన్స్‌ఫారమ్ దిమ్మె నిర్మాణం, 35 అడుగుల విద్యుత్ స్తంభాలు రెండు, 30 అడుగుల స్తంభాలు రెండు, సపోర్టు స్తంభాలు నాలుగు, కేబుల్ వైరు వినియోగిస్తున్నామని, పనులను రెండు రోజులలో పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



లలితమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, ఆగస్టు 24 : కొరిశపాడు మండలంలోని రావినూతలలో పలు కార్యక్రమాలకు రాష్ట్ర విద్యుత్ మంత్రి రవికుమార్ హాజరయ్యారు. టీడీపీ మహిళ నాయకురాలు చప్పిడి లలితమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లలితమ్మ కుమారుడు చంద్రశేఖర్‌ను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కే కాంతారావు సతిమణి ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కారుసాల నాగేశ్వరరావు, మొపర్తి లక్ష్మీనారాయణ, యడ్లపల్లి నరసింహరావు, కారుసాల బ్రహ్మానందం, కారుసాల సుబ్బయ్య, కారుసాల గురుబాబు ఉన్నారు.

చమత్కార శబ్దార్థముల గారడీ అవధానం



శతావధానంలో పాల్గొన్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పృచ్ఛకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 24 : చమత్కార శబ్దార్థముల గారడీ అవధానం అని ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథ రచయిత, శతావధాన సంచాలకులు పోటూరి వెంకట శివరామ ప్రసాదరావు అన్నారు. సాహితీ మిత్ర మండలి అద్దంకి, పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో సంపూర్ణ శతావధాన కార్యక్రమం శనివారం లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యంచే 4వ శతావధానం మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కవితలకు పుట్టినిల్లు కొప్పరపు వారిల్లని, పద్యం పాతబడలేదనడానికి సాక్ష్యం అవధానం అన్నారు. ఈ శతావధానంలో వివిధ జిల్లాల నుంచి 25 మంది పృచ్ఛకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు, మురళీసుధాకరరావు, కుకట్ల సుబ్బారావు, డివియం సత్యనారాయణ, డాక్టర్ యు. దేవపాలన, చిన్ని మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

చినగంజాం, ఆగస్టు 24 : ఇంకొల్లు జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగిరెడ్డి స్వామిరెడ్డి, కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16 విభాగాలలో బాలబాలికలకు, 18, 20, 23 విభాగాలలో యువతీయువకులకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పుట్టిన రోజు సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. పోటీలు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు గోపీచంద్ రెడ్డి 8074992796, 7675026220, పీడీ కే.మధు 9949741392 సెల్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విద్యాశాఖలో పథకాలకు మహనీయుల పేర్లు

ఒంగోలు (విద్య), ఆగస్టు 24: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో అమలవుతున్న వివిధ పథకాల పేర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం మార్చింది. గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్ పేరుతో అమలు చేసిన వాటికి మహనీయుల పేర్లు పెట్టింది. వారిని గౌరవించింది. ఈమేరకు ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్య మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశీలగ్రత విభాగం డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం ఆరు పథకాల పేర్లను మార్చారు. జగనన్న అమ్మ ఒడికి తల్లికి వందనంగా నామకరణం చేశారు. జగనన్న విద్యాకానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా మార్చారు. జగనన్న గోరుముద్ద ఇకపై డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా అమలు చేయనున్నారు. మనబడి నాడు-నేడును మనబడి-మనభవిష్యత్‌గా మార్చారు. స్వేచ్ఛ పథకానికి బాలికా సురక్ష పేరు పెట్టారు. జగనన్న ఆణిముత్యాలను అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారంగా మార్చారు. ఈనెల 22 నుంచి ఈ పథకాలకు కొత్తపేర్లు అమల్లోకి వచ్చాయి

వచ్చేనెల మొదటి వారంలో సాగర్ నీరు విడుదల

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24 : జిల్లాలో సాగుకు సాగర్ నీటిని వచ్చేనెల మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కేటాయింపుల ఆధారంగా నీటి పంపిణీ జరుగుతుందన్నారు. సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఆమె కోరారు. జిల్లాలో అధికారికంగా ఉన్న ఆయకట్టు 2,54,392 ఎకరాలకు ఒక పంటకు సాగునీటిని ఇస్తామన్నారు. అవసరమైతే వారబందీ విధానంలో నీటిని మేజర్లకు సరఫరా చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణలో నీటిని క్రమపద్ధతిన వినియోగించుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని అందుకోసం మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ కోరారు.

స్పా సెంటర్‌లో పోలీసుల తనిఖీలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 24: ఒంగోలు నగరంలోని ఓ స్పా సెంటర్‌లో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గతంలోనూ ఇదేవిధంగా ఆకస్మిక దాడులు నిర్వహించగా సదరు స్పాసెంటర్‌లలో మహిళలు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న మహిళలను హోంకు పంపించి, స్పాసెంటర్ యజమానితోపాటుగా అక్కడకు వెళ్ళిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో పోలీసులు మరోమారు తనిఖీలు చేయగా అక్కడ మహిళలు లేరు. దీంతో స్పాసెంటర్ యజమానులకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తాలుకా ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

24 శాతమే!

- ఖరీఫ్‌లో పంటల సాగు పరిస్థితి ఇదీ
- వెంటాడుతున్న వర్షాభావం
- సాధారణంలో నాల్గోవంతు కూడా దాటని విస్తీర్ణం
- కీలకమైన కంది, పత్తి సాగుకు మించిపోతున్న సమయం
- ఎండల తీవ్రతతో వేసిన పైర్లు కూడా వాడుముఖం
- ఆందోళనలో రైతులు



పిసిపల్లి మండలంలో సాగుకు నోచుకోకుండా బీడును తలపిస్తున్న భూమి

నిండు వర్షాకాలం. ఊరూవాడా చిత్తడిగా మారాల్సిన సమయం. పొలంలో వేసిన విత్తనాలు మొలకెత్తి పచ్చదనం పరుచుకోవాల్సిన తరుణం. కానీ జిల్లాలో అందుకు పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా వర్షాభావం వెంటాడుతోంది. ఆకాశంలో కమ్ముకుంటున్న కారు మబ్బులు రైతుల్లో ఆశలు రేకెత్తించి అంతలోనే మాయమవుతున్నాయి. అక్కడక్కడా జల్లులు తప్ప జడివాన కరువైంది. దీంతో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో నాల్గోవంతు కూడా సాగుకు నోచుకోలేదు. వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తుండటంతో వేసిన పైర్లు కూడా ఎండిపోతున్నాయి. కీలకమైన కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా చేయలేమని వారు వాపోతున్నారు.

ఒంగోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ ప్రతికూలంగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచినా సాధారణంలో 24శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఖరీఫ్ సీజన్‌గా పరిగణిస్తారు. ఆ సమయంలో సుమారు 2.02 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. కంది, పత్తి, మిర్చి ప్రధాన పంటలు. వాటితోపాటు వరి, సజ్జ, జొన్న మొక్కజొన్న, నువ్వు, పెసర, మినుము ఇతరత్రా పలు పైర్లు వేస్తారు.

ఒక్క వరి పూర్తిగా సెప్టెంబర్‌లో, అదే నెలలో మిర్చి కొంత విస్తీర్ణం సాగు చేస్తారు. మిగతావన్నీ వర్షాధార పంటలే. సాధారణంగా ఈ సమయానికి ఆ పంటల సాగు మూడొంతులు పూర్తవుతుంది. ఆ రకంగా ఆగస్టు ఆఖరుకు లక్షన్నర హెక్టార్లలో పంటలు సాగవుతాయి. అయితే మరో ఐదు రోజుల్లో నెల ముగుస్తున్నా ఇంతవరకూ 50 వేల హెక్టార్లలో కూడా పంటలు సాగుకు నోచుకోలేదు.

48,464 హెక్టార్లలోనే పంటల సాగు

జిల్లాలోని ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో ఇప్పటి వరకూ కేవలం 48,464 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో కేవలం 24 శాతం లోపుగానే విత్తనం పడింది. సకాలంలో వర్షాలు కురవక ఈ పరిస్థితి ఏర్పడింది. వాతావరణం అనుకూలించి సకాలంలో పంటలు సాగైతే ఈ సమయానికి జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో ఏగ్రామం వెళ్లినా పొలాలు పచ్చని పైర్లతో కళకళలాడుతుండేవి. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి కన్పించడం లేదు. ఎక్కువ భూములు సాగుకు నోచుకోలేదు. వేసిన పైర్లు కూడా వాడుముఖం పట్టాయి.



దర్శి ప్రాంతంలో ఎదుగుదల లేని కందిపైరు

ఆరంభంలో మురిపించి.. ఆతర్వాత సరిపడా కురవని వాన

ఈ ఏడాది తొలుత కాస్తంత అనుకూలంగానే వాతావరణం కనిపించింది. జూన్‌లో సాధారణం కన్నా అధికంగానే వర్షం కురిసింది. దీంతో జిల్యావ్యాప్తంగా రైతులు సాగుకు సిద్ధమయ్యారు. అయితే జూలైలో నెలకొన్న వర్షాభావం పంటల సాగును దెబ్బతీసింది. దుక్కులు దున్ని విత్తేందుకు సిద్ధమైన రైతులు వర్షాలు లేక పంటలు సాగు చేయలేకపోయారు. తొలకరి పైర్లుగా పిలుచుకొనే సజ్జ, జొన్న, నువ్వు, పెసర పశుగ్రాసం సాగుకు జూలైలో నెలకొన్న వర్షాభావం విఘాతం కల్పించింది. ఖరీఫ్‌లో కీలకమైన కంది, పత్తి, మిర్చి ఇతరత్రా వాటిపైనా ఆ ప్రభావం పడింది.

అత్యధిక ఖరీఫ్‌లో విస్తీర్ణంలో కంది, పత్తి సాగు చేస్తారు. ఈ సీజన్‌లో కంది సుమారు 73 వేలు, పత్తి 31 వేలు వెరసి ఈ రెండు పంటలే దాదాపు 1.04లక్షల హెక్టార్లలో సాగు చేస్తారు. ఇప్పటివరకూ రెండు పంటలూ కలిసి కేవలం 26 వేల హెక్టార్లలోపు మాత్రమే సాగు కాగా మరో ప్రధానమైన మిర్చి సాగు కూడా కదల లేదు. ఈ నెలాఖరుతో కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండగా తదుపరి వర్షాలు కురిసినా వరి, మిర్చి, మినుము, ఇతర పంటలు సాగుకు పెద్దగా అవకాశం ఉండదు. ఈ ప్రకారం చూస్తే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా జరిగే అవకాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్కూలు బస్సులపై కొరడా

- రవాణా శాఖ అధికారుల తనిఖీలు
- తొమ్మిది కేసులు నమోదు



బస్సులను తనిఖీచేస్తున్న అధికారులు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూలు బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో 60 బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని బస్సు డ్రైవర్లు, పన్నులు చెల్లించని బస్సు యాజమానులపై తొమ్మిది కేసులు నమోదు చేసినట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. నిబంధనల ప్రకారం 60 ఏళ్లు పైబడిన వారు బస్సు నడపకూడదు. అయితే ఓ బస్సు డ్రైవర్‌కు 60 ఏళ్లకుపైన ఉన్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. మరో రెండు బస్సులు క్వార్టర్ ట్యాక్స్ చెల్లించకపోగా, ఒక బస్సుకు అసలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదు. ఇరువురు డ్రైవర్లు లైసెన్సులు లేకుండా, నలుగురు యూనిఫాం ధరించకుండా బస్సు నడుపుతున్నారు. వీరందరిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి నట్లు ఎంవీఐ తెలిపారు. నిత్యం తనిఖీలు చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా స్కూలు బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు 'మీకోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24: ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (ప్రజా ఫిర్యాదుల దినం)ను సోమవారం రద్దు చేసినట్లు కార్యక్రమ జిల్లా సూపరింటెండెంట్ డి.నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా సెలవు దినం కావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అర్జీలతో ఎవ్వరూ ఒంగోలు రావద్దని ఆమె కోరారు.

లక్షాధికారిని చేయడమే లక్ష్యం

- నేడు లఖ్‌పతీ దీదీ పథకం ప్రారంభం
- తొలి విడత జిల్లాలో 7,050 మంది పొదుపు మహిళల ఎంపిక
- స్వయం ఉపాధి కోసం రుణాలు
- అన్ని మండలాల్లో ప్రధాని మోదీ సందేశం వినిపించే ఏర్పాట్లు చేసిన అధికారులు



ఒంగోలు నగరం, ఆగస్టు 24 : పొదుపు సంఘాల మహిళల్ని లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతీ దీదీ పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని ప్రధాని మోదీ ఆదివారం మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలను అందించనున్నారు. ఈ యూనిట్ల నిర్వహణ ద్వారా ఏడాదికి ఒక్కో లబ్ధిదారునికి వార్షికాదాయం లక్ష రూపాయలకు తగ్గకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఈ పథకం కింద యూనిట్లను స్థాపించే వారిని ప్రభుత్వం లక్‌పతీ దీదీలుగా పిలవనుంది. ఒక్కొక్కరికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రుణం ఇవ్వనుంది. వారు యూనిట్లను స్థాపించుకుని వాటిని విజయంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన సహకారం సెర్ప్ నుంచి అందించనుంది. ఈ యూనిట్ల స్థాపన ద్వారా నెలకు రూ.10 వేలు తగ్గకుండా ఏడాదికి రూ. లక్షకుపైగా ఆదాయం లభించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. జిల్లాలో వెలుగు, పేదరికి నిర్మూలన సంస్థ అధికారులు 1.18 లక్షల మంది మహిళల్ని ఇప్పటి వరకు లక్‌పతీ దీదీలుగా గుర్తించారు. వీరిలో 7,050 మందికి ఈ ఏడాది రుణాలు అందజేసి యూనిట్లను స్థాపించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఈ పథకాన్ని ఆదివారం ప్రధాని మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలుతోపాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పొదుపు సంఘాల మహిళలు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. తొలి విడతగా ఈ పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన 7,050 మందికి అధికారులు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సంబంధిత సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

ఒంగోలు గనుల శాఖ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ఐదేళ్లలో ఇసుక అక్రమాలపై ఆరా
- రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24: ఒంగోలులోని భూగర్భ, గనుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన ఇసుక అక్రమాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఇసుకు తవ్వకాలకు ఇచ్చిన అనుమతుల గురించి విచారించినట్లు తెలిసింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ ఇసుక టెండర్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో ఒంగోలులో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ సోదాలు కొనసాగాయి. పూర్తిగా కార్యాలయం గేట్లు మూసివేసి సిబ్బందిని మాత్రమే లోపలికి అనుమతించారు. రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రకాశం జిల్లాలో ఇసుక తవ్వకాల లీజును వైసీపీ హయాంలో జేపీ పవర్ వెంచర్స్‌కు ఇచ్చారు. అయితే జేపీ పవర్ వెంచర్స్ అప్పట్లో అడ్డగోలుగా తవ్వకాలు, అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏసీబీ అధికారులు సమగ్రంగా విచారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి ఎంత చెల్లించారు? అసలు బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా ఎలా జరిగింది? అన్న విషయాలపై లోతుగా ఆరా తీసినట్లు సమాచారం. ఇసుక రీచ్‌లు లేకుండానే ఎక్కడైనా అనుమతులు ఇచ్చారా? అన్న అంశాన్ని కూడా పరిశీలించినట్లు సమాచారం.

ఇసుక తవ్వకాలకు సంబంధించి జేపీ పవర్ వెంచర్స్ ప్రభుత్వానికి రూ.13 కోట్లు చెల్లించాలని గనుల శాఖ గతంలో నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. కానీ ఆమొత్తాన్ని ఇప్పటి వరకూ చెల్లించలేదని సమాచారం. అందుకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. తనిఖీలలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ డీపీతో మస్కా!

- చాటింగ్‌తో చీటింగ్ చేసేందుకు యత్నం
- అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి
- వెంటనే సదరు నంబర్ బ్లాక్
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ దామోదర్ సూచన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల ఫొటోలు డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా పెట్టుకొని అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఏకంగా ప్రకాశం ఎస్పీ దామోదర్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని ఆయనకు తెలిసిన వ్యక్తి నుంచి నగదు గుంజేందుకు ప్రయత్నించిన ఉదంతం శనివారం వెలుగు చూసింది. దీన్ని గమనించిన సదరు వ్యక్తి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే మోసగాడి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయించారు. తదుపరి చర్యలకు ఆదేశించారు. ఆ మోసగాడు... ఎస్పీ ఫేస్‌బుక్ ఫ్రెండ్‌కు తొలుత 'హలో... హవ్ ఆర్ యూ... వేర్ ఆర్ యూ యట్ ది మూమెంట్' అని మెసేజ్ పంపాడు. అనంతరం మిస్‌డ్ వాయిస్ కాల్ చేశారు. ఆతర్వాత కొద్దిసేపటికి చాలా అత్యవసరం, ఆపదలో ఉన్నామంటూ మెసేజ్ చేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు పంపాలని కోరాడు. అయితే ఆ విషయాన్ని ఎస్పీకి ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్ ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఎస్పీ దామోదర్ అప్రమత్తమై వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రముఖుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కొందరు మాయగాళ్లు మోసం చేస్తున్నారన్నారు. ఎవరైనా అత్యవసరమని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు పంపాలని తొందరపెడితే నమ్మవద్దన్నారు. అనుమానంగా ఉంటే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

సోలార్‌తో నాణ్యమైన విద్యుత్

ముండ్లమూరు, ఆగస్టు 24: సోలార్‌తో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. వాతావరణంలో కూడా కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ముండ్లమూరు మండలంలోని గుంగన్నపాలెం వద్ద 14 ఎకరాల్లో రూ.15 కోట్ల వ్య యంతో ఏర్పాటుచేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగా హైడ్రోజన్, విండ్ పీఎస్పీ మరికొన్ని పద్ధతుల్లో ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుకు పనికిరాని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అం దుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిందని మంత్రి రవికుమార్ ధ్వజమెత్తారు. సోలార్ ద్వారా ఒక్క యూనిట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలే దన్నారు. జల, థర్మల్ విద్యుత్తులు అధిక వ్యయంతో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ప్రక్క రాష్ట్రాల కంటే తమ బినామీ సంస్థల ద్వారా విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 56 రోజుల్లోనే 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిందన్నారు. అందులోభాగంగా ఇప్పటికే స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. విద్యుత్ వైరు కొర తతో కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లోనే కండక్ట ర్లు వచ్చిన వెంటనే కనెక్షన్లు అందజేస్తామన్నారు.

గ్రామీణ ప్రాంతమైన మారెళ్లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసిన సినీ నిర్మాత అశోక్‌బాబును గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, డాక్టర్ లలిత్‌సాగర్, ప్లాంట్ నిర్వాహకులు అశోక్‌కుమార్, ఎస్ఈ సత్యనారాయణ, సీఈవో ఉన్నం నవీన్, సీవోవో ఆర్తీక, బాతు కరీమ్, ఏడీ పిచ్చయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటి బండారు పద్మావతి మృతి

అద్దంకి, ఆగస్టు 24 : ప్రముఖ రంగస్థల నటుడు బండారు రామారావు కుమార్తె రంగస్థల నటి, టీవీ ఆర్టిస్ట్, రేడియో ఆర్టిస్ట్ బండారు పద్మావతి శనివారం నెల్లూరులో మృతి చెందారు. అద్దంకికి చెందిన పద్మావతి నెల్లూరులో స్థిర పడ్డారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ పద్మావతి పలు పౌరాణిక పాత్రలతో జనాదరణ పొందారు. పద్మావతి మృతి పట్ల అద్దంకి నియోజకవర్గ కళాకారుల సంఘం ప్రతినిధులు సంతాపం తెలిపారు.



అన్న క్యాంటీన్‌కు విరాళం

అద్దంకి, ఆగస్టు 24: అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి విరాళాలను అందించడం అభినందనీయమని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొటికలపూడిలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకాగా, తిమ్మారెడ్డిపాలెంకు చెందిన గాలి నారాయణ రూ.10వేల చెక్కును అన్న క్యాంటీన్‌కు విరాళంగా ప్రకటిస్తూ మంత్రి రవికుమార్‌కు అందజేశారు.



మంత్రికి చెక్కును అందజేస్తున్న నారాయణ

అడిగేవారు..అడ్డుకునేవారెవరు?

- ఆ ధీమాతోనే ఓ వ్యక్తి ఇష్టారాజ్యం
- సాగర్ కాలువకట్ట, పొలాల అంచున యథేచ్ఛగా గ్రానైట్ వ్యర్థాల డంపింగ్
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు

మార్టూరు, ఆగస్టు 24 : చెరువు గట్లు, పొలాల అంచుల వద్ద గ్రానైట్ వర్థాలను రాత్రికిరాత్రే డంప్ చేయడంలో అతడో రింగ్ మాస్టర్. మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన అతనిపేరు అందరికీ తెలియకపోవచ్చుగానీ లడ్డోడు అంటే తెలియనవారుండరు. అతడికి రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ ఉన్నాయి. వాటి సాయంతో జొన్నతాళి, మార్టూరు గ్రామాలకు చెందిన కొన్ని గ్రానైట్ పరిశ్రమలకు చెందిన వ్యర్థాలు, పనికిరాని రాళ్లు, గ్రానైట్ బూడిదను టిప్పర్లలో రాత్రికి రాత్రికి తరలించి ఖాళీగా కన్పించే పొలాలు, చెరువు గట్ల అంచుల్లో పడేస్తున్నారు. ఈ దందా కోసం గ్రానైట్ ఫ్యాక్టరీల యాజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. వ్యర్థాలను దూరప్రాంతాలకు తరలించి డంపింగ్ చేయడం ఎందుకులే అనుకున్నాడో ఏమో గానీ తన సొంత గ్రామంపై మమకారంతో, ఎవరూ తనను అడ్డుకోరన్న ధీమాతో గ్రామంలోని చెరువు గట్లు, పొలాలు అంచుల్లో వ్యర్థాలను ఇష్టానురీతిన పడేస్తున్నారు. ఇటీవల జాతీయరహదారిపై గ్రామ బ్రిడ్జికి సమీపంలో బొల్లాపల్లి సాగర్ కాలువ వద్ద, కాలువ కట్టపై భారీగా వ్యర్థాలను తరలించారు. కొంతకాలంగా ఈ దందా సాగుతున్నా రెవెన్యూ, పంచాయతీ, సాగర్ కాలువ అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయమై గత నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో సాగర్ కాలువైతే మాకేంటి.. శీర్షికన కథనం ప్రచురితమైంది. కాని కొనంకి ఎన్ఎస్‌పీ అధికారులు ఇంతవరకు స్పందించలేదు. దాంతో గ్రామంలోని వ్యక్తి మరింత ఉద్ధృతంగా గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. అంతేగాకుండా సమీపంలోని గ్రావెల్ కొండ నుంచి అక్రమంగా అడపాదడపా గ్రావెల్‌ను తవ్వి అమ్మకాలు చేస్తుంటాడు. గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేయడం, చేసుకోవడంలో తప్పులేదుగానీ ఇలా గ్రామంలోని ఖాళీ ప్రదేశాలలో, చివరకు సాగర్ కాలువ గట్లపై వేస్తుండడంతో మున్ముందు జరిగే నష్టం భారీగానే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో అధికారులు పట్టించుకోలేదు. చంద్రబాబు ప్రభుత్వమైనా వెంటనే పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శనివారం కొంతమంది గ్రామస్థులు ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకొచ్చారు.

గ్రానైట్ వ్యర్థాలను ఇక్కడ వేయొద్దని చెప్పాం

గ్రామంలో గ్రానైట్ వ్యర్థాలను కొన్నింటిని తొలగించాం. ఆ ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తే కేసు పెడతామని సదరు వ్యక్తికి హెచ్చరించాం. సిబ్బంది కొరత కారణంగా పూర్తిగా చర్యలు తీసుకోలేకపోతున్నాం.

- హరిబాబు, పంచాయతీ కార్యదర్శి, బొల్లాపల్లి



సాగర్ కాలువ కట్టపై గ్రానైట్ వ్యర్థాల కుప్పలు



బొల్లాపల్లి గ్రామంలో చెరువు కట్టపై పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న శివనాగేశ్వరరావు

సేవా కార్యక్రమాలే లక్ష్యం

టీడీపీ సీనియర్ నేత శివనాగేశ్వరరావు

పర్చూరు, ఆగస్టు 24 : ప్రజాసేవే లక్ష్యంగా కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు టీడీపీ సీనియర్ నాయకులు కొండ్రగంటి శివనాగేశ్వరరావు అన్నారు. శనివారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలోని బధిరుల పాఠశాలలోని గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. భవిష్యత్‌లో ఫెడరేషన్ ద్వారా నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి సాయం అందించే విధంగా కార్యాచరణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు కొల్లా రాజేశ్వరరావు (రాజా), రొటేరియన్ గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, కొల్లా చౌదరి, కోట శ్రీనివాసరావు, కోట వీరప్రసాద్, కొల్లా సుబ్బారావు, నార్నే చంద్రశేఖర్, బత్తుల సాంబశివరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కోలలపూడి విద్యార్థి

మార్టూరు, ఆగస్టు 24 : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూరిమెట్ల సంజయ్ మూడవ లిస్టులో ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. ఒంగోలు క్యాంపస్‌లో సీటు లభించింది. తమ పాఠశాలల్లో ముగ్గురు సీట్లు లభించాయని విద్యా కమిటీ ఛైర్మన్ తాతా నాగేశ్వరరావు తెలిపారు.

ఆ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి

ఎమ్మెల్యే ఏలూరికి వినతి

పర్చూరు, అగస్టు 24: గత వైసీపీ పాలనలో నిధులు మంజూరు చేయక అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా, గ్రామీణ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని శనివారం మండలం అడుసుమల్లి గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ఏలూరికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న విద్యార్థులు

పర్చూరు, అక్టోబరు 24 : పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చాటిచెప్పేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకృష్ణుడు, రాధా, గోపిక వేషధారణతో వేసిన నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఉట్టికొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోరంట్ల సుబ్బారావు, డైరెక్టర్ లక్ష్మయ్య చౌదరి, ప్రిన్సిపాల్ షాఫియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

మార్టూరు, ఆగస్టు 24 : జొన్నతాళి సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న పసుమర్తి దానియేలు అనే వృద్ధుడిని కారు ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో దానియేలు రోడ్డు పక్కన డివైడర్ పైకి ఎగిరి పడిపోయారు. దాంతో అతని కాలికు గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇసుకదర్శి గ్రామానికి చెందిన దానియేలు జొన్నతాళి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చిత్తూరు జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి కారు విజయవాడ వెళ్తుండగా ఢీకొట్టింది. దానియేలును ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒంటరి మహిళ ఇంట్లో చోరీ

అదుపులో నిందితుడు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 24 : దత్తక్షేత్రం సమీపంలో నాగమణి అనే ఒంటరి మహిళ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి ఒంగోలు రిమ్స్‌లో పనిచేస్తుంది. ఎప్పటి మాదిరిగా ఆమె డ్యూటీకి వెళ్లింది. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళం కోసి తీసి ఉంది. ఇంట్లో బీరువాలో ఉన్న రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.48వేల నగదుతో పాటు టీవీ చోరీ అయినట్లు బాధితురాలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 24 : మండలంలోని మున్నంవారిపాలెంలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి ఐదుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ తెలిపారు. పేక ఆడుతున్న 5గురుని అరెస్ట్ చేసి వారి వద్ద గల రూ.1100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

పంగులూరు, ఆగస్టు 24 : పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో శనివారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఖోఖో అంతర్జాతీయ క్రీడాకారుడు తపాల శాఖ ఏపీవో పోతిరెడ్డి శివారెడ్డి కళాశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన ప్రొజెక్టర్, వాల్ స్క్రీన్, ట్రాలీ స్పీకర్ కొనుగోలుకు రూ.50వేల నిధులు సమకూర్చారు. డిజిటల్ బోధన సులభ తరంగా ఉంటుందని, కళాశాలలో విద్యార్థులకు అకడమిక్ , క్రీడా సం బంధమైన విషయాలు స్క్రీన్‌పై చూసి తెలుసుకునే అవకాశం ఉంటుందని ప్రిన్స్‌పాల్ ఉషారాణి తెలిపారు. దాత శివారెడ్డికి ప్రిన్స్‌పాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాయిణి ప్రమీల, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రమేష్, రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య, పీడీ సీతారామిరెడ్డి, గుడిపూడి రామారావు పాల్గొన్నారు.

దేవిశ్రీకి ఏలూరి అభినందనలు

పర్చూరు, అగస్టు 24 : మార్టూరు మండలం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో శనివారం గిన్నిస్ బుక్ అవార్డు అందుకున్న ఆదిపూడి దేవిశ్రీని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకునేందుకు విద్యార్థి చేసిన కృషిని ఈసందర్భంగా ఏలూరి కొనియాడారు. నిబద్ధత, అంకిత భావంతో కృషి చేస్తే ఫలితాలు వస్తాయన్నారు. కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన దేవిశ్రీ కాఫీ పొడిని నీటితో ఉపయోగించుకొని వాటర్ పెయింట్ ద్వారా 150 అడుగుల గాంధీ మహాత్ముని రూపాన్ని చిత్రీకరించి గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకుంది. ఈసందర్భంగా పలువురు దేవిశ్రీని అభినందించారు.



దేవిశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి



అమ్మవారి పూజల్లో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

ఘనంగా అంకమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం

మంత్రి గొట్టిపాటి పూజలు

పంగులూరు, ఆగస్టు 24 : మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఉదయగిరి వారి వంశ దేవర చిన అంకమ్మతల్లి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయగిరి వంశస్తులు నూతనంగా నిర్మించిన ఆలయంలో చిన అంకమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయానికి గ్రామానికి చెందిన పూనాటి రామాంజనేయులు 15 సెంట్ల స్థలాన్ని సమకూర్చగా, మంత్రి గొట్టిపాటి సహకారం అందించారు. మంత్రి గొట్టిపాటికి నిర్వాహకులు ఉదయగిరి వెంకటేశ్వర్లు, రామయ్య, ఆజనేయులు సారథ్యంలో స్థానికులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాదెండ్ల నరసింహారావు, ఎనికపాటి శ్రీనివాసరావు, గొల్లపూడి అంజయ్య, పెండ్యాల సుబ్బారావుతో పాటు టీడీపీ మండల నాయకులు కేవీ సుబ్బారావు, రావూరి రమేష్, ఏడుకొండలు, చింతల సహదేవుడు, మస్తాన్‌వలి, ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, జగన్, స్వామి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, శేషగిరి, రవిబాబు, కాజా, జేకేసీ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎనికపాటి శింగయ్య ఇంట జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వరుడు వాసును ఆశీర్వదించారు.

సాగు పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల

చినగంజాం, ఆగస్టు 24 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల అన్నారు. వ్యవసాయ కార్యాలయ వద్ద బాపట్ల ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు ఆధారిత కార్యకలాపాలుపై శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని విజయ నిర్మల సూచించారు. రైతులు నేల ఆరోగ్యం కాపాడాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని అన్నారు. రైతులకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవలంబించాల్సిన సాగు పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం. జె.మోహన్, ఏవో భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మి, వీఏఏలు, ఎంపీఈఓఎస్, జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ఇంద్ర బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



ఇంద్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 24 : ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. ఆర్టీసీ డిపోలో నూతనంగా చీరాల, హైదరాబాద్‌కు ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర బస్సులను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్సులో తొలి టికెట్ కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తుందన్నారు. అందులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణానికి సంబంధించిన హామీని త్వరలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా మహిళలు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బస్ డిపో మేనేజరు శ్యామల, బస్సు డ్రైవరు, కండక్టరు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా

అద్దంకి, ఆగస్టు 24 : తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురై ఉంది. సమస్యను మంత్రి రవికుమార్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈఈ, డీఈఈ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు రైతులకు తెలిపారు.



పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

రక్తదానంతో ప్రాణదానం

చీరాల, ఆగస్టు 24 : రక్తదానం మరొకరికి ప్రాణ దానంతో సమానమని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్ అన్నారు. శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో చీరా ల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ రాజా సెల్వన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.జ్యోతి స్వరూప్, ఎన్ఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్

నిందితులను కఠినంగా శిక్షించాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 24: కోల్‌కతా హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు కావూరి రఘుచంద్ అన్నారు. శనివారం అద్దంకి పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక నాయకులు డాక్టర్ వై. హనుమంతరావు, ప్రజా సంఘాల నాయకులు మన్నం త్రిమూర్తులు, లెక్చరర్ పద్మావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కార్యదర్శి తిరుపతిరెడ్డి, గంగాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంకొల్లు, ఆగస్టు 24 : కోల్‌కతా ఘటనపై నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ ఇంతియాజ్, మండల పార్టీ అధ్యక్షులు నారిశెట్టి ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ముస్తాఫా అంబేడ్కర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీ శ్రీనివాస గ్రానైట్స్, ఉప్పుమాగులూరు గ్రామము, బల్లికురవ మండలము, బాపట్ల జిల్లా వారి తరుపున మేనేజింగ్ పార్టనర్, సర్వాన్ సింగ్ క్లైయిర్ కేరాఫ్ హజర్‌సింగ్ క్లైయిర్ వారి వద్ద నుండి సమాచారము పొంది యావన్మందికి తెలియజేయునది.

ఈ దిగువ సుదహరించిన షెడ్యూలు దాఖలా అయిటం నెం.2 షెడ్యూలు దాఖలా ఆస్తి జంగ్రాజుపల్లి రమేష్ తండ్రి పిచ్చయ్యకు ది. 12-11-2021న మార్టూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన దఖలా దస్తావేజు నెం. 4266/2021రు ద్వారా సన్ను, మరియు వారసత్వ రీత్యా సంక్రమించి వీరియొక్క స్వాధీన హక్కు భుక్తములలో యున్నది. అయిటం నెం. 1 షెడ్యూలు దాఖలా భూమి జంగ్రాజుపల్లి పిచ్చయ్య తండ్రి దేవసహాయమునకు వారసత్వ రీత్యా సంక్రమించి వీరియొక్క స్వాధీన హక్కు భుక్తములలో కలదు. సదరు షెడ్యూలు దాఖలా భూములను వారు విక్రయింపచూపగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు ఖరారు పడినందున సదరు షెడ్యూలు ఆస్తి భూమి కొనుగోలుపై ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని వున్న యెడల ఈ క్రింది తెలుపబడిన చిరునామాకు ఏడు రోజులు లోపల తెలుపగలరని యిందుమూలముగా తెలియపరచడమైనది. సదరు ఆక్షేపణలు/ అభ్యంతరాలు ఏడు రోజులు లోపల తెలియజేయని యెడల సదరు భూమిపై ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి, నా క్లయింటు పై వారి వద్ద నుండి సక్రమమైన రిజిష్టరు దస్తావేజు పొందగలరని తెలియజేయడమైనది.

1వ అయిటము: డిటో గ్రామము, డిటో గ్రామ సర్వే నెం. 539/సి.బి. యం. 1.90 సెంట్లుకు హద్దులు. తూర్పు: జంగ్రాజుపల్లి రమేష్ భూమి; దక్షిణము: జంగ్రాజుపల్లి రమేష్ మరియు సురేష్ వారల భూమి; పడమర: జూపల్లి అంజనేయులు గారి భూమి; ఉత్తరము: శ్రీ శ్రీనివాస క్వారీ వారి భూమి. ఈ హద్దుల మధ్య యం. 1.90 సెంట్లుకు హద్దులు. తూర్పు: జంగ్రాజుపల్లి రమేష్ భూమి; దక్షిణము: జంగ్రాజుపల్లి రమేష్ మరియు సురేష్ వారల భూమి; పడమర: జూపల్లి అంజనేయులు గారి భూమి; ఉత్తరము: శ్రీ శ్రీనివాస క్వారీ వారి భూమి. ఈ హద్దుల మధ్య యం. 1.90 సెంట్లు భూమి మాత్రమే.

2వ అయిటము భూమి: (1) డిటో గ్రామము, డిటో గ్రామ సర్వే నెం. 537/1ఎ 2లో విస్తీర్ణము, యం. 0.85 సెంట్లున్ను, 537/1బి/1బిలో యం. 0.16 సెంట్లున్ను, పూర్తి విస్తీర్ణము: యం. 1.01 సెంట్లుకు హద్దులు. తూర్పు: జంగ్రాజుపల్లి సురేష్, పడమర: జూపల్లి అంజనేయులు ఇతర భూమి; దక్షిణము: రోడ్డు; ఉత్తరము: జంగ్రాజుపల్లి పిచ్చయ్య ఇతరుల భూమి. ఈ హద్దుల మధ్య యం. 1.01 సెంట్లు భూమి మాత్రం. (2) డిటో గ్రామము, డిటో గ్రామ సర్వే నెం. 539-సిఎ2లో యం. 0.62 సెంట్లకు హద్దులు. తూర్పు: జంగ్రాజుపల్లి సురేష్ భూమి; దక్షిణము: పి తాలూకు భూమి; పడమర: నా తాలూకు భూమి; ఉత్తరము: దామా వెంకట నాగరాజు భూమి. ఈ హద్దుల మధ్య యం. 0.62 సెంట్లు భూమి మాత్రమే.

స్థలము: చిలకలూరిపేట
తేది: 24-08-2024

ఇట్లు
యస్.సుధాకరరెడ్డి, అడ్వకేట్
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 24: ప్రభుత్వం సూచించే విధి విధాలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారం అందించుకోవాలని ఎంపీడీవో ఆర్.దేవసేనకుమారి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయాశాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో గ్రామా ల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయని వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విద్యుత్ శాఖ అధికారిని చక్రాయపాలెం సర్పంచ్ గోగులమూడి నగేష్, కుంకుపాడు సర్పంచ్ గాలం శ్రీనివాసరావులు ప్రశ్నించారు. మండలంలోని 76 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగిందని ఎంఈవో సుధాకరావు తెలిపారు. మహిళలకు వెలుగు పథకం ద్వారా రాయితీపై అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో హాజరు కావల్సిన ప్రజా ప్రతినిధులకు బదులు పలువురు షాడోలు తిరుగుతుండడం విశేషం. వచ్చిన ప్రజా ప్రతినిధుల్లోని కొందరు సంతకాలు పెట్టామా వెళ్లామా.. అనేవిధంగా సమావేశం నుంచి జారుకున్నారు. వీరి పద్ధతిని పరిశీలిస్తే ఎన్నుకున్న గ్రామ ప్రజల సమస్యలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. సమావేశంలోనే హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం, అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ అవగాహన కార్యక్రమాలు అన్ని ప్రాంతాలల్లో రెండు నెలల పాటు జరుగుతాయని సంస్థ ప్రతినిధి బీవీ సాగర్ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు, పాల్గొన్న ఎంపీపీ జ్యోతి, ఎంపీడీవో దేవ సేన కుమారి

బావిలో పడి మహిళ మృతి

ఇంకొల్లు, ఆగస్టు 24 : ఇంకొల్లులోని గంగవరం రోడ్డులోని చెరువుకట్ట సమీపంలోని బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన చలిచం పద్మావతి కుటుంబం కొంత కాలంగా ఇంకొల్లులో నివాసముంటున్నారు. భర్త అనారోగ్యంతో బాధపడంతో పాటు మానసిక వత్తిడితో పద్మావతి మతిస్థిమితం లేక శుక్రవారం బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు .శనివారం బావిలో శవం కన్పించడంతో దీనిపై ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జవాబుదారీగా పనిచేయాలి

చీరాల, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ జావాబుదారీతనంతో పనిచేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేస్ పార్టీ ప్రజా ప్రతనిధులు, నాయకులకు సూచిం చారు. మున్సిపల్ ఛైర్మన్ చాంబర్‌లో శనివారం ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో వెంకటేష్ సమావేశం అయ్యారు. జరుగుతున్న, జరగాల్సిన పరిణామాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు.




మాట్లాడుతున్న వెంకటేష్



ముందస్తు సంబరం

జిల్లావ్యాప్తంగా కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.

ఏఎస్‌పేట : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు





నాణెం అబ్బే.. వద్దులేండి!

'అబ్బే.. ఆ కాయిన్ వద్దులేండి. మీరిచ్చినా మార్చుకునేందుకు మా వల్ల కాదు.. ఉంటే నోటు ఇవ్వండి. లేదా ఫోన్‌పే చేయండి.' అంటూ వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ ఇదే పరిస్థితి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం మీరు తీసుకోవాలి కదా! అని ప్రశ్నిస్తే అవన్నీ మాకు తెలియదు సార్.. కాయిన్ తీసుకుని మేం ఇబ్బంది పడలేం. అర్థం చేసుకోండి' ఇలా ఖరాకండీగా చెప్పేస్తున్నారు.

- రూ.10 నోట్ల కొరత.. నాణేలే దిక్కు!
- అయినా తీసుకోని వ్యాపారులు
- ఆర్టీసీ బస్సుల్లోనూ అంతే!
- ఆర్బీఐ సూచనల బేఖాతరు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 24 : జిల్లాలో పది రూపాయల నోట్లకు కొరత ఏర్పడింది. ఇందుకూ ప్రత్యామ్నాయమైన రూ.10 నాణేన్ని చెలామని చేద్దామన్నా కొంతమంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమీరా అంటున్నారు. 2019లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన రూ.10 నాణేన్ని స్టాండర్డు డిజైన్‌లతో నాలుగు రకాలుగా రూపొందించారు. పది రూపాయల నోటు ఎక్కువ కాలం నాణ్యత, మన్నికగా ఉండదు. దీంతో సుమారు 20 ఏళ్లపాటు చెలామణిలో మన్నికగా ఉండేలా ఆర్బీఐ రూ.10 నాణెంను అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, 2, 5 రూపాయల నాణేల తరువాత రూ. 10 నాణెం విలువైంది. ఇప్పటికి ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా చెలామణిలో ఉన్నా మన జిల్లాలో మాత్రం అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై మహానగరంలో ఆ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. అక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని నెల్లూరులో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

● తీసుకోకుంటే కేసే!

పది నాణెం చెలామణిలో ఉందని, అన్ని చోట్ల అది చెల్లు బాటువుతుందని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు, ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు.

● ప్రచారం లోపం

రూ.10 నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ బాధ్యత బ్యాంకర్లదే. జిల్లాలో వందలాది బ్యాంకులు ఉండగా, వాటి పరిధిలో వేలాది మంది ఖాతాదారులు ఉన్నారు. ఖాతాదారుల సమావేశం, బ్యాంకులతో వ్యాపార సంబంధాలు నెరిపే వ్యాపారులతోనూ రూ.10 నాణెం విషయం బ్యాంకర్లు ప్రస్తావించడం లేదనేది సమాచారం. బ్యాంకర్లు బాధ్యతగా తీసుకుని రూ.10 నాణెంపై ప్రచారం నిర్వహిస్తే వాటి చెలామణి పెరుగుతుంది. జీఎస్టీ అధికారులు కూడా వ్యాపారులతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. వారు కూడా వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రూ. 10 నాణెం ఎక్కడైనా చెల్లుతుంది



రూ.10 నాణెం తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలలో చెలామణిలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా నెల్లూరులో ఎందుకో చెలామనిలో లేదు. బ్యాంకులలో వాటిని మార్చుకోవచ్చు. డిపాజిట్ చేయవచ్చు. ఈ నాణేన్ని తిరస్కరించే బ్యాంకర్లపై ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారులు, ఇతరులకు ఈ నాణెంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎల్‌డీఎం

'ఉపాధి' భోక్తలపై వేటు

12 మంది సిబ్బంది సస్పెన్షన్ ● రూ.61లక్షల రికవరీకి ఆదేశాలు

కలువాయి, ఆగస్టు 24 : గత వైసీపీ పాలనలో కలువాయి మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో కనీవినీ ఎరుగని రీతిలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకు బాధ్యులైన 12 మంది సిబ్బందిని సస్పెండ్ చేస్తూ డ్వామా కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి శనివారం ఉత్తర్వులు అందాయి. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) జే.శీనయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ) ఆర్.ప్రసూన, ఎం.వెంకటేశ్వర్లు, ఎంవీ.ప్రసాద్, క్షేత్రసహాయకులు (ఎఫ్ఏ) రవీంద్ర (చీపినాపి), వేమనారాయణ (పర్లకొండ), నరసయ్య (ఉయ్యాలపల్లి), ఎస్కే. మస్తాన్ (చింతలపాళెం), ప్రతిమ (బాలాజీరావుపేట), మహేంద్ర (చిన్నగోపవరం), సుమన్ (బ్రాహ్మణపల్లి), హరి (కనుపూరుపల్లి మేట్)లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేగాక వారి నుంచి రూ.61లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే రికార్డులు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకోవాలని ఏపీవోను ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కసారిగా 12 మంది సిబ్బంది సస్పెండ్ కావడం కలువాయి మండలంలో చర్చనీయాంశంగా మారింది. 2023-2024లో జరిగిన సుమారు రూ.11కోట్ల ఉపాధి పనులపై ఇటీవల 16వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో రూ.2.89 కోట్లు అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించి ప్రజావేదికలో ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఉపాధి సిబ్బందిని విచారించిన అధికారులు రూ.61 లక్షలు రికవరీకి ఆదేశించడంతో పాటు ఇందుకు బాధ్యులపై వేటు వేశారు.

● చిన్నగోపవరంలోనూ..

చిన్నగోపవరంలోనూ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్‌కార్డులలో ఇతర ప్రాంతాలకు చెందిన 148 మంది పేర్లు పేర్లు ఎక్కించి వారందరూ ఉపాధి పనులకు వెళుతున్నట్లు బోగస్ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఈ మేరకు ఎఫ్ఏ మహేంద్ర నుంచి రూ.27.45 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (విద్య) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టంబరు 5వతేదీ) సందర్భంగా జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ నెల 31వ తేదీ లోపు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ, డిప్యూటీ ఈఓల ద్వారా దరఖాస్తులను జిల్లా కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. నేరుగా పంపిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు.

వైసీపీ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పర్వతరెడ్డి

వైసీపీ ప్రభుత్వ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖరరెడ్డిని పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నియమించారు. తనపై ఉన్న నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని ఈ సందర్భంగా పర్వతరెడ్డి పేర్కొన్నారు.





గంజాయి.. సై..రన్!

అర్ధరాత్రి ముఠా కోసం పోలీసుల చేజింగ్

- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- చేజింగ్‌లో కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- కోనసముద్రం దాటాక ఆగిన చేజింగ్
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్ట్.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు

ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లోనే చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్టపడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకు ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావుకు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు.

● అర్ధరాత్రి 1.30 గంటలకు..

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. అంతే.. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

● 3 గంటలు హైటెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు అంటే 3 గంటల పాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపు కాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, పోలీసులపైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందు కోనసముద్రం గ్రామం వైపు తెల్లవారుజామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే, కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.



కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. అంతేగాక కారు రవాణా చేస్తున్న గంజాయి ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు నిందితులు, దాచిన గంజాయిని వెలికితీసే పనిలో పడ్డారు.

- నెల్లూరు (క్రైం)/ వెంకటాచలం/ మర్రిపాడు

ఓం నారాయణ.. ఆదినారాయణ

- వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం
- ఉత్సాహంగా రథోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన గొలగమూడి

వెంకటాచలం, ఆగస్టు 24 : 'ఓం నారాయణ.. ఆదినారాయణ' భక్తుల నామస్మరణతో గొలగమూడి క్షేత్రం మారుమోగిపోయింది. ఇక్కడ జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో చివరిరోజు శనివారం తరలివచ్చిన భక్తజనంతో గొలగమూడి కిక్కిరిసిపోయింది. స్వామివారి సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి భక్తులు గంటల కొద్దీ క్యూలో నిలబడ్డారు. భక్తుల కోసం ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మంచినీరు, మరుగుదొడ్లు వంటి వసతులతోపాటు వైద్యశిబిరాలు కల్పించారు. కాగా, ఉదయం 9 గంటలకు స్వామివారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆశ్రమ ఈవో సోమిరెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ తర్వాత పది గంటలకు వెంకయ్యస్వామి రథాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి ముందుకు లాగి ప్రారంభించారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. రథంపై ఆశీనులైన స్వామివారు గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రథం చుట్టూ పోలీసులు ప్రత్యేక వలయాన్ని ఏర్పాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ వెంకయ్య స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ పాలక మండలిసభ్యులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కనుల పండువగా తెప్పోత్సవం

కాగా, రాత్రి ఆశ్రమం పక్కన ఉన్న కోనేరు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన తెప్పపై వెంకయ్య స్వామివారిని ఆశీనులను చేశారు. తరలివచ్చిన భక్తుల నడుమ కోనేరులో వెంకయ్యస్వామి విహరించారు. ఈ సందర్భంగా సంస్కృతిక, నాటక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



భక్తుల నడుమ సాగుతున్న వెంకయ్యస్వామి రథం



తెప్పపై విహరిస్తున్న వెంకయ్యస్వామి



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధన

ఆత్మకూరు, ఆగస్టు 24: మండలంలోని దేవూరులో భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అనంతరం వెంకయ్యస్వామిని ప్రత్యేకంగా అలంరించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లా ఆదిశేషయ్యనాయుడు, పెంచలయ్యనాయుడు, తూమాటి శేషయ్యనాయుడు, తిరుతినాయుడు, దొడ్ల సుమన్, సర్పంచి రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచి కర్నం వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం : స్థానిక కొత్తూరులోని వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, అనంతరం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సంగం :పూలాలంకరణలో వెంకయ్య స్వామి



ఆత్మకూరు : దేవూరు వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరులో కృష్ణాష్టమికి ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, ఆగస్టు 24: పట్టణంలోని కృష్ణమందిరాల్లో కృష్ణాష్టమిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక యాదవవీధిలో ఉన్న కృష్ణమందిరాన్ని నూతనంగా అలంకరించారు. అలాగే రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి మందిరంలో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఉదయం స్వామివారికి అ భిషేకంతో ప్రత్యేక పూజలు మొదలవుతాయి. ఉదయం 10.30 గంటలకు క ల్యాణం నిర్వహించనున్నారు. ఉభయకర్తలుగా పచ్చిపాల మోహన్, పద్మ దంపతులు వ్యవహరిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి కార్యక్రమం, రాత్రి 7 గంటలకు కుంకుమపూజ, ప్రసాదవినియోగం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే టెంకాయతోపులోని రాధాకృష్ణ మందిరంలో కూడా స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు.

సీఐకి సన్మానం

ఉదయగిరి రూరల్ : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ల చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందిన ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో కావ్య కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి షేక్ సికిందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీనివాసులు, ఉస్మాన్‌గని. మున్నా, జనార్దన్, సందానీ, అలీబాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన 104 వాహనం



వరికుంటపాడు: స్థానిక వైద్యశాల నుంచి శనివారం వేంపాడులో నిర్వహించే శిబిరానికి వైద్యులు, సిబ్బందితో బయలుదేరిన 104 వాహనం కూతవేటు దూరంలోని కాకొల్లువారిపల్లి- రామాపురం గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆగిపోయింది. దీంతో చేసేదేమిలేక మోటారు బైకులపై వెళ్లిన సిబ్బంది మొక్కుబడిగానే కార్యక్రమాన్ని నిర్వహించారు. పైలెట్ మాత్రం రోజంతా వాహనం వద్దే పడిగాపులు కాయాల్సిన వచ్చింది.

'ప్రకాశం' ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంస

కందుకూరు, ఆగస్టు 24: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ఫలితాలు సాధించటమే గాక క్రమ శిక్షణలో అగ్రగామిగా ఉన్నారని ఆంధ్రా బెటాలియన్ సుబేదార్ మేజర్ పుష్పరాజ్, హవల్దార్ కిమ్‌బహదూర్ థాపాలు ప్రశంసించారు. శనివారం కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బీ సర్టిఫికెట్ పరీక్షలో కళాశాల నుంచి 25 మంది క్యాడెట్లు పాల్గొనగా నూరుశాతం ఫలితాలు సాధించటమే గాక అత్యధిక మంది ఏ గ్రేడ్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ఎన్‌సీసీ అధికారులు షేక్ ఇమాంస, సంతోష్‌కుమార్, మీరావలి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : పోకూరులో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశు సంవర్థకశాఖ ఉపసంచాలకుడు చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పశువైద్యశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం మాల్యాద్రి డెయిరీ ఫాంను పరిశీలించి పాడిపరిశ్రమపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధికారి పులి వంశి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అనుపమ, సిబ్బంది అశోక్, చౌడయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కందుకూరు, ఆగస్టు 24: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వర రావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు : ఎస్‌ఐగా షేక్ జిలాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. పోలీసు సిబ్బంది ఆయ న్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన డీఎస్పీ వేణుగోపాల్‌ను సీఐ గంగాధర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

సీతారామపురం మండలంలోని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించా రు.అనంతరం సీతారామపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశా రు.ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల బిల్లులు త్వరగా వస్తాయని, సిమెంట్.ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలని దుత్తలూరు పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని సోమలరేగడ ఎస్సీ కాలనీలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఆరోగ్య కార్యకర్త నారాయణ, ఏఎన్ఎం చంద్రావతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ నేతల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 24 : మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లిలో జరుగుతున్న ఇంటి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం టీడీపీ నాయకుడు చల్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణంపై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సమాచారం అందుకున్న సీఐ గంగాధర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరసన విరమించబోమని టీడీపీ నేతలు తెలిపారు. ఈ క్రమంలో వెంకట్రావుపల్లి సచివాలయం ఇన్‌చార్జ్ టీపీఎస్ సురేంద్ర అక్కడకు చేరుకుని అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి వచ్చామని తెలిపారు. దీంతో వారు నిరసనను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గండళ్ల వేణు, మాజీ కౌన్సిలర్ పముజుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

ఏఎస్ పేట,ఆగస్టు24: మట్టిని అక్రమంగా తవ్వి తరలించడంపై శనివారం తహసీల్దార్ శ్రీరామకృష్ణకు అక్బరాబాదు ఉపసర్పంచి బీ గురువారెడ్డి, బీజేపీ నాయకులు కప్పవరపు వెంకటేశ్వర్లు,జనసేన మండల అధ్యక్షుడు అక్బర్, పలువురు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామ స మీపంలోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఎక్స్‌కవేటర్‌తో పెద్ద పెద్ద గుంతలు తవ్వేస్తూ మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారని వారు తెలిపారు. ఈ విషయమై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యూత్ ఫెస్ట్ క్విజ్‌లో సంగం విద్యార్థుల ప్రతిభ

సంగం, ఆగ స్టు 24: నెల్లూరు లో శనివారం జరిగిన జిల్లా యూత్ ఫెస్ట్ 2024 క్విజ్ పోటీల్లో సంగం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థునులు ద్వితీయస్థానం సాధించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సోఫియా, 9వ తరగతి విద్యార్థిని ప్రణీక్ష పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. వారికి డీఈవో రామారావు ప్రశంసాపత్రం అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

మామిడిచెట్ల నరికివేతపై ఫిర్యాదు

అనంతసాగరం, ఆగస్టు 24: తన పొలంలోని మామిడి చెట్లను గ్రా మానికి చెందిన కొందరు నరికి వేశారని మండలంలోని రేవూరుకు చెందని పీ గిరిజారెడ్డి శనివారం తహసీల్దార్ వీరవసంతరావుకు ఫిర్యాదు చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో తనకున్న 6.77 ఎకరాల వ్యవసాయ భూమిలో ఉన్న మామిడిచెట్లు, రేకుల షెడ్డును కొందరు తొలగించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేసినట్లు తెలిపారు. ఇందులో ముగ్గురి ప్రమేయం ఉందని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ, బీజేపీ నేతలకు అక్రమ లేఅవుట్లు లేవా?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 24: మున్సిపల్ అధికారులు ప్రకటించిన అక్రమ లేఅవుట్లలో కేవలం వైసీపీ వారి పేర్లే ఉన్నాయని, టీడీపీ, బీజేపీ నేతల అక్రమ లే అవుట్లు ఎందుకు ప్రకటించలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఎన్టీఆర్ కూడలిలోని 100 అడుగుల జాతీయ జెండా ఐకాన్‌ను ఆయన వైసీపీ నేతలతో కలిసి సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పైలాన్ ధ్వంసమైన చోటే పైలాన్ కట్టిస్తామన్న మంత్రి నారా లోకేష్ మాటకు విలువలేదా అని ప్రశ్నించారు. జాతీయ జెండా వద్ద ఫొటో గ్యాలరీలో మాజీ ఎమ్మెల్సీ, క్విట్ ఇండియా ఉద్యమ నేత మధురాంతకం మాధవరావు, కావలి అభివృద్ధి ప్రదాత బీద రవిచంద్ర, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలు లేకపోవడం వారిని అవమానించడమేనన్నారు.

గురుకులంలో వైద్య శిబిరం

లింగసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, రక్తహీనత, జాతీయ నులి పురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహలత, సీహెచ్‌వో జీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.13,84,259

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.13,84,259 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం, కుంకుమార్చన, వివాహములు, తలనీలాలు, వాహనపూజలు, ప్రత్యేకదర్శనం, స్థలపురాణం పుస్తకాలు, రూము అద్దెలు, కవర్లు, లడ్డూప్రసాదం, అన్నదానం, విరాళాలు ద్వారా ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు.

జడ్పీ హైస్కూల్ తనిఖీ

కావలి, ఆగస్టు 24: కావలి పట్టణం ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈవో వెంకటసుబ్బయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను లింగసముద్రం పోలీసులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం బాజీ బాబు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

ఉలవపాడు, ఆగస్టు 24 : కౌమార దశలో యువత ఎయిడ్స్ హెచ్ఐవీపై అవగాహన కలిగిఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ గోపీచంద్ ప్రకాష్ అన్నారు. సింగరాయకొండ మండలంకు చెందిన మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంస్థ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మదర్‌ల్యాండ్ సొసైటీ ఒఆర్‌డబ్ల్యూలు టీ సుభాషిణి, ఎమ్ వెంకట్రావు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

31న అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, ఆగస్టు 24: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 31న ఐసీఆర్ఏసీఈ 2024 అంతర్జాతీయ సదస్సు జరగనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం కళాశాలలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో సరికొత్త పరిశోధనలు నూతన ఆవిష్కరణలపై దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పాల్గొననున్న ప్రొఫెసర్లు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ లిఖిత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్లాంటు స్విచ్ఛాన్ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి

గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే గగనం

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అల్లూరు, ఆగస్టు 24: గత ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలవాలంటే గగనంగా ఉండేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా అభివృద్ధి కోసం ఏమి కావాలని అడుగుతున్నారని, ఇది ఆంధ్రరాష్ట్ర ప్రజల అదృష్టమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్త్‌మోపూరులో వీపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును శనివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, బీద గిరిధర్, నెల్లూరు నిరంజన్‌రెడ్డి అమర్‌రెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులే మాట్లాడాలి : ఎమ్మెల్యే కావ్య

బిట్రగుంట, ఆగస్టు 24: మండల సమావేశాల్లో ప్రజలతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే మాట్లాడాలని, ఇతరులు లోపలికి రాకూడదని, మాట్లాడకూడదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి హితవు పలికారు. ఎంపీపీ ఎం.సుజాత అధ్యక్షతన శనివారం జరిగిన బోగోలు మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశానికి కొందరు సర్పంచులు హాజరుకాకుండా వారి కుటుంబ సభ్యులు హాజరవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు, తహసీల్దారు సురేష్‌బాబు, ఏవో గోవిందరావు, ఎస్సై బోజ్యా, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

15 జగనన్న కాలనీల్లో రూ.11 కోట్లతో 54 ఇళ్లు నిర్మించారు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 24: మండలంలో 15 జగనన్న లేఅవుట్లు వేసి 506 ఇళ్లు మంజూరు చేసి రూ.11 కోట్లు ఖర్చు చేసి కేవలం 54 ఇళ్లు నిర్మించారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్న మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో భారీ దోపిడీ జరిగిందన్నారు. అధికారులు బాధ్యతతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఇంచార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఇక్బాల్, డీఎల్‌పీవో కృష్ణ మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఉలవపాడు మండల సమావేశం

ఉలవపాడు, ఆగస్టు 24 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. శాఖల వారీగా అధికారులు గణాంకాలు వివరించారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులో ఒకరిద్దరు తప్ప ఎవరూ అధికారుల పనితీరును ప్రశ్నించలేదు. వీరేపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు బస్సును గ్రామం వరకు కొనసాగించాలని మన్నేటికోటకు చెందిన సర్పంచు పులివర్తి బసవయ్యనాయుడు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో ఎస్ విజయ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు పొంగళ్లు



పొంగళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొండాపురం, ఆగస్టు 24: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో వెలసిన మహాలక్ష్మమ్మకు శనివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాలు సంయుక్తంగా పోలేరమ్మ గుడిని నిర్మించుకొని గత నాలుగు ఆదివారాలనుండి చద్ది సమర్పించారు. 5వ వారం ముందురోజు పొంగళ్లపెట్టి నైవేద్యం సమర్పించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : వలేటివారిపాలెం హైస్కూల్‌లో గత ఏడాది పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల వంతున పూర్వ విద్యార్థి గుత్తా నరసింహం శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే 500 మార్కులు పైన సాధించిన 13 మందికి రూ.వెయ్యి వంతున అందజేశారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు హజరయ్యే విద్యార్థులకు అట్టలు, పెన్నులు, అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కమల్‌కుమార్, మాజీ సొసైటీ అధ్యక్షుడు వలేటి నరసింహం, మాజీ ఎంపీటీసీ భర్త వీ. నరసింహం, గుత్తా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూ లైన్లో ఉన్న భక్తులు

బిట్రగుంట, ఆగస్టు 24: బోగోలు మండలం బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. దాతలు అమరా బచ్చు ట్రస్ట్ నిధులతో నిర్వాహకులు కృష్ణకుమార్, సంధ్యలు నిర్మించిన కార్యానిర్వాహక భవనం, అన్నదాన సదన్‌లను ఆలయ ఈవో రాధాకృష్ణ, కావలి తహసీల్దారు శ్రావన్‌కుమార్ ప్రారంభించారు. మూడవ శ్రావణ శనివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు.

రెండు దుకాణాల్లో చోరీ?

బిట్రగుంట, ఆగస్టు 24: బోగోలు పంచాయతీలో దొంగలు రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఘటన శనివారం ఉదయం తెలిసింది. శుక్రవారం రాత్రి ఓ దుకాణంలో రూ.3వేలు, మరో దుకాణంలో రూ.500 అపహరించుకుని వెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై బోజ్యను వివరాలు కోరగా చోరీలపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయితే చోరీ జరిగిందంటున్న ప్రచారంపై విచారణ చేపట్టామని తెలిపారు.